
షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు   తెలుగు దినపత్రిక




సంపుటి : 1 సంచిక : 313 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 29 సెప్టెంబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 312 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunrday 29 September 2024 PAGES : 8 PRICE : 5/-




## అక్టోబర్‌లో మహారాష్ట్ర ఎన్నికలు

- నవంబర్ 26వ తేదీతో ముగియనున్న అసెంబ్లీ గడువు
- రెండు విడతల్లో ఎన్నికలు జరిగే అవకాశం
- ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న ఎన్నికల నేరాలపై విచారణను వేగవంతం చేయాలని రాష్ట్ర పోలీస్ అధికారులను ఆదేశం
- అసెంబ్లీ ఎన్నికల సన్నాహకాలపై సమీక్షించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్

## స్వర్ణాంధ్రప్రదేశ్@2047 కోసం


# సూచనలు ఆహ్వానిస్తున్నాం



- ఉజ్వల భవిష్యత్తు కోసం అందరూ కలిసి రావాలన్న చంద్రబాబు
- ప్రతి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడి
- తలసరి ఆదాయం రూ.36 లక్షలకు పెంచడమే ధ్యేయమని స్పష్టీకరణ

**అమరావతి**

స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారం చేసుకోవడంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉజ్వల భవిష్యత్తు కల్పించే దిశగా మీ వద్ద ఏమైనా ఆలోచనలు ఉన్నాయా... ఉంటే స్వర్ణాంధ్రప్రదేశ్@2047 కోసం మీ సూచనలు మాకు పంపించండి అని కోరారు. సూచనలను ప్రజలు swarnandhra.ap.gov.in/Suggestions వెబ్ పోర్టలకు పంపించాలని చంద్రబాబు తన ట్వీట్ లో పేర్కొన్నారు. ప్రజలు అందించే సహకారానికి అభినందనగా ఈ-సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. స్వర్ణాంధ్రప్రదేశ్@2047 దిశగా ప్రయాణం ప్రారంభించామని, 2047 నాటికి మెరుగైన వృద్ధిరేటు సాధనే లక్ష్యమని వెల్లడించారు. ప్రతి అభిప్రాయానికి విలువనిస్తామని, ప్రజల నుంచి వచ్చే ప్రతి సూచనను పరిగణనలోకి తీసుకుంటామని, తద్వారా సమష్టిగా స్వర్ణాంధ్రను నిర్మిస్తామని వివరించారు. 2047 నాటికి భారత్ జీఎస్డీపీ 2.4 ట్రిలియన్ డాలర్లకు చేరుకునేలా రాష్ట్రం నుంచి తోడ్పాటు అందించడం, తలసరి ఆదాయం రూ.36 లక్షలకు పెంచడమే తమ ధ్యేయం అని చంద్రబాబు పేర్కొన్నారు.



## త్వరలోనే కొత్త ఇంటర్నెట్

- ఏ మూలకైనా అదిరిపోయే సిగ్నల్..
- ట్రాయ్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు
- శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వస్తే మారుమూల గ్రామాల్లో వేగవంతమైన అంతర్జాల సేవలు అందుబాటులోకి

# సిఫార్సులు.. లంచాలకు తావు లేకుండా బదిలీలు

- గ్రామ స్థాయి అభివృద్ధిపై సీఎం చంద్రబాబు నిర్దేశించిన లక్ష్యాలు అందుకొనే దిశగా అడుగులు
- కూటమి ప్రభుత్వం ఆశ్రిత పక్షపాతం లేకుండా... ప్రజలకు మేలు చేసేలా పని చేస్తుంది
- ఇది మంచి ప్రభుత్వం.. పాలన మొదలై 100 రోజులు దాటింది.
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**అమరావతి**

కూటమి పాలన మొదలై 100 రోజులు దాటింది. ముందుగా శాఖాపరమైన అధ్యయనం చేసి ప్రజా ప్రయోజనం, అభివద్ధే లక్ష్యంగా నేను చేపట్టిన శాఖల్లోని పథకాలను పకడ్బందీగా అమలుపరచాలని నిర్ణయించుకున్నాను. ఆ దిశగా సిఫార్సులు.. లంచాలకు తావు లేకుండా బదిలీలు చేసి గ్రామ స్థాయి అభివృద్ధిపై సీఎం చంద్రబాబు నిర్దేశించిన లక్ష్యాలు అందుకొనే దిశగా అడుగులు వేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఈమేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శాసన సభ సమావేశాల్లో, మంత్రి మండలి సమావేశాల్లో 'కూటమి ప్రభుత్వం - మిగతా 3లో



# జగన్ చెప్పినవన్నీ కుంటి సాకులే

- జగన్‌ను పులికేశితో పోలుస్తూ అనిత సెటైర్...
- డిక్లరేషన్ ఇవ్వడానికి జగన్ కు వచ్చిన ఇబ్బంది ఏంటో తెలియడంలేదు
- మంగళగిరిలో మీడియాతో మాట్లాడిన ఏపీ హోంమంత్రి
- ఆయన్ను తిరుమలకు రాకుండా ఆపే ప్రయత్నం చేయలేదని స్పష్టీకరణ
- తిరుమలకు రావద్దని నోటీసులు ఇవ్వలేదన్న మంత్రి అనిత
- తిరుమల వెళ్లే ఇష్టంలేకే పర్యటన రద్దు చేసుకున్నారని వ్యాఖ్య

**అమరావతి**

తిరుమల పర్యటనపై పులివెందుల ఎమ్మెల్యే తీసుకున్న నిర్ణయాలకు పులకేశి నెంబర్ ఎంతివ్వాలో కూడా అర్థం కావట్లేదు అంటూ హోంమంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. - మిగతా 3లో



## వందే భారత్ అంతర్జాతీయ డిమాండ్

- కొనుగోలుకు కెనడా సహా పలు దేశాల ఆసక్తి..!
- ఈ రైళ్లకు దేశవ్యాప్తంగా డిమాండ్
- ఈ క్రమంలోనే పలు దేశాలు సైతం సెమీ హైస్పీడ్ రైళ్లపై దృష్టి
- వందే భారత్‌లో ఉన్న అత్యాధునిక సౌకర్యాలతో రైళ్లను తయారు చేసేందుకు రూ.160 నుంచి రూ.180కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా.
- ఇది జపాన్ బుల్లెట్ రైలు కంటే ఎక్కువ.

## వెంకట్‌రెడ్డి లాంటి తీగలే కాదు.. పెద్ద డొంకలు సైతం కదలాలి



- వెంకటరెడ్డి వెనుక వేల కోట్లు కొల్లగొట్టిన ఆ ఘనుడు ఎవరో అందరికీ తెలుసు: షర్మిల
- గనుల శాఖ మాజీ ఎండీ వెంకటరెడ్డిని అరెస్ట్ చేసిన ఏసీబీ
- ఆ పెద్ద డొంక ఏ ప్యాలెస్‌లో ఉన్నా విచారణ జరపాలి
- అడ్డగోలుగా సహజ సంపదను దోచుకుతిన్నారంటూ ధ్వజం

# చంద్రబాబును దేవుడే శిక్షిస్తాడు

- జగన్మోహన్ రెడ్డి తిరుపతి వస్తే ఆటంకాలు సృష్టించాలని బీజేపీ నాయకులు చూశారు
- జగన్ తిరుమల దర్శనానికి వెళ్లాలని ప్రయత్నిస్తే పోలీసులు ఆటంకాలు కల్పించారు
- శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో తప్పు జరిగి ఉంటే తప్పకుండా శిక్షించాలి
- ఎన్నికలకు ముందు స్టీల్ ప్లాంట్ కోసం ఏం చెప్పారు
- నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుకున్నాయన్నారు
- బియ్యం కూడా కొనుక్కొనే పరిస్థితి ప్రజలకు లేదు



**విశాఖపట్నం**

వైసీపీ అధినేత జగన్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ఆపార్టీ నేతలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. "మా అధినేత ఇచ్చిన పిలుపు మేరకు వైసీపీ నాయకులు దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు" అని తెలిపారు. అపచారాలను మన్నించాలని ఆలయాలకు వెళ్లి క్షమాపణ కోరుకున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన తప్పులకు ప్రజలకు శిక్ష వేయొద్దని భగవంతుడిని ప్రార్థించామన్నారు. వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా చంద్రబాబు నాయుడు వ్యవహార శైలి ఉందని విమర్శించారు. శ్రీవారి లడ్డూపై భక్తులను గందరగోళానికి గురి చేశారని మండిపడ్డారు. చంద్రబాబు అబద్ధాన్ని పదే పదే చెబుతూ నిజం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెయ్యిలో కల్తీ జరిగితే థర్డ్ పార్టీతో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి తిరుపతి వస్తే ఆటంకాలు సృష్టించాలని బీజేపీ నాయకులు చూశారని మండిపడ్డారు. జగన్ తిరుమల దర్శనానికి వెళ్లాలని ప్రయత్నిస్తే పోలీసులు ఆటంకాలు - మిగతా 3లో

# సిఫార్సులు.. లంచాలకు తావు లేకుండా బదిలీలు

-మొదటిపేజీ తరువాయి

ఆశ్రిత పక్షపాతం లేకుండా... ప్రజలకు మేలు చేసేలా పని చేస్తుంద' స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా, పక్షపాతరహితంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖల ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశాను. ప్రతిభా, సమర్థత, నిబంధనలు కొలమానాలుగా తీసుకోవాలని తెలిపాను. ప్రజా ప్రతినిధులు, సహచర మంత్రుల నుంచి వచ్చిన సిఫార్సుల విషయంలో సైతం బదిలీలకు నిర్దేశించుకున్న కొలమానాలకు అనుగుణంగా ఉంటే పరిగణనలోకి తీసుకోవాలని సూచించాను. డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్లు, ఏపీడీలు, డి.పి.ఓ.లు, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ.ల బదిలీల ప్రక్రియ మొదలయ్యే ముందే మా కార్యాలయం పూర్తి సమాచారం తీసుకుంది. కొందరు అధికారులు గత పాలకుల ప్రాపకం మూలంగానో, నాటి బదిలీల్లో సాగిన లావాదేవీల వల్లనో ఒకే ప్రాంతంలో కీలక పోస్టుల్లో అటూఇటూగా మారుతూ ఉన్నారు. ఆ ప్రాంతాలను తమ జాగీర్లుగా మార్చుకొనే స్థితికి చేరుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖలతో సంబంధం లేని జైళ్ల శాఖ, ఖజానా శాఖ... ఇతర శాఖల నుంచి ఫారిన్ సర్వీస్ అనే నిబంధన ద్వారా వచ్చి జిల్లా పోస్టుల్లో పని చేస్తూ ఉన్నారు. అదే సమయంలో ప్రతిభ, సమర్థత, సమగ్రత ఉండి కూడా అప్రాధాన్యంగా మిగిలిపోయిన అధికారులు ఈ శాఖలో ఉన్నారు. వారికి కుల సమీకరణం కుదరకనో, రాజకీయ సమీకరణాల వల్లనో తగిన గుర్తింపు దక్కలేదు.

బదిలీ ప్రక్రియ మొదలుపెట్టగానే అప్పటికే సేకరించిన సమాచారం ఆధారంగా ఉన్నతాధికారులు కసరత్తు చేశారు. నిర్దేశించిన కొలమానాలకు అనుగుణంగా లేని పక్షంలో ఆ అధికారులను ఇతర స్థానాలకు పంపించారు. అదే విధంగా పి.ఆర్., ఆర్.డి. అధికారులకు మాత్రమే డ్వామా పి.డి.,



ఏపీడీ, జడ్పీ సి.ఈ.ఓ. పోస్టులు ఇవ్వాలని కూడా నిర్ణయం తీసుకున్నాము. అందువల్ల ఇతర శాఖల నుంచి ఈ శాఖలోకి రావాలనుకున్నవారిని, ఆ విధంగా వచ్చిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకోలేదు. ఏ దశలోనూ బదిలీల విషయంలో ఆర్థిక లావాదేవీలకు తావు లేకుండా చూసుకున్నాము. పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖలో ఇంత పారదర్శకంగా, లంచాలకు ఆస్కారం లేకుండా ఇటీవలి సంవత్సరాల్లో బదిలీలు జరగలేదు... పకడ్బందీగా బదిలీలు చేశారు అని వార్తా కథనాలు, ఉద్యోగుల నుంచి స్పందన వచ్చింది. ఇది మంచి ప్రభుత్వం కాబట్టే చిత్తశుద్ధితో బదిలీలు పూర్తి చేశాము. మా కూటమికి ఆశ్రిత పక్షపాతం లేదు. ప్రజలకు మేలు చేయాలనే తలంపుతోనే నిర్ణయాలు తీసుకుంటాము. అందుకు కట్టుబడి ఉంటాము. సిఫార్సులు, సూచనలు చేసిన ప్రజా ప్రతినిధులు, మంత్రివర్గ సహచరులకు వారు కోరిన అధికారికి ఆ స్థానం ఎందుకు ఇవ్వలేకపోయామో వివరించాము. గతంలో నిర్వర్తించిన బాధ్యతల్లో చురుగ్గా, అప్పగించిన ప్రాజెక్టులు సక్రమంగా నిర్వర్తించినవారికి మరో జిల్లా అప్పగించాము. మా ముందు ఉన్న నివేదికలో ఆరోపణలు, ప్రతికూలమైన కామెంట్స్ వచ్చిన వారికి కీలక బాధ్యతలు ఇవ్వలేదు.

**రాష్ట్ర అభివృద్ధికి నిధులు ఇచ్చేందుకు ప్రధాని సిద్ధం..**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి తగినన్ని నిధులు ఇచ్చేందుకు సంసిద్ధంగా ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రామ స్థాయి నుంచి అభివద్ధి మొదలు కావాలని స్పష్టమైన లక్ష్యాలు ఇచ్చారు. స్వర్ణ పంచాయతీలు కావాలని గ్రామ సభలు ఏర్పాటైన రోజున స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజులలోపునే కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.4500 కోట్లు ఉపాధి హామీ నిధులను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పొందింది. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1987 కోట్లు వచ్చాయి. 2027నాటికి జల్ జీవన్ మిషన్ ద్వారా 95.44 లక్షల ఇళ్లకు కుళాయి ద్వారా రక్షిత నీరు నిరంతరాయంగా సరఫరా చేయాలనేది పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్. శాఖలకు ఉన్న లక్ష్యం. ఈ ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక ప్రణాళికకు మన రాష్ట్రనికిగాను రూ.215.8 కోట్లు బడ్జెట్ ను కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆమోదింప చేసుకున్నాము. ఈ విధంగా కేంద్రం నుంచి అవసరమైన నిధులు పొందుతూ పంచాయతీల్లో అభివద్ధి పనులు చురుగ్గా, లక్ష్యాన్ని అందుకొనేలా పూర్తి చేయాలి. ఇందుకోసం సమర్థులైన, సమగ్రత కలిగిన అధికారులకు బాధ్యతలు అప్పగించేందుకు బదిలీల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాం.బదిలీల్లో సిఫార్సులు, లంచాలకు ఆస్కారం ఇవ్వలేదు. కచ్చితంగా వారు జవాబుదారీతనంతో పని చేస్తారు. ఎందుకంటే ఇది బాధ్యత కలిగిన పాలకులతో కూడిన మంచి ప్రభుత్వం అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెల్లడించారు.

# జగన్ చెప్పినవన్నీ కుంటి సాకులే

-మొదటిపేజీ తరువాయి

తిరుమల పర్యటనను రద్దు చేసుకున్న జగన్ చెప్పినవన్నీ కుంటి సాకులే అంటూ వ్యాఖ్యలు చేశారు. డిక్లరేషన్ ఇచ్చి తిరుమలకు వెళ్తే తన తల్లికీ, చెల్లికి పట్టిన గతే తనకూ పడుతుందని భయపడి పర్యటన రద్దు చేసుకున్నారన్నారు. డిక్లరేషన్ ఇవ్వటం ఇష్టం లేక డైవర్షన్ రాజకీయాలు చేసింది జగనే అంటూ మండిపడ్డారు. లడ్డూ టేస్ట్ గురించి మాట్లాడిన జగన్ ఏ రోజు తిరుమల లడ్డూ రుచి చూశాడో చెప్పాలని డిమాండ్ చేశారు.

**మతవిద్వేషాలు రెచ్చగొట్టేందుకు...**

డిక్లరేషన్ ఇవ్వమంటే దళితులకు అంశాన్ని ముడిపెట్టి మతవిద్వేషాలు రెచ్చగొట్టే యత్నం జగన్ చేశారని మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎస్సీ అయిన ప్రస్తుత మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామికి ఆనాడు టీటీడీ బోర్డులో అవకాశం కల్పించారని తెలిపారు. హిందూ దళితురాలైన తనకు కూడా టీటీడీ బోర్డు అవకాశం వస్తే బ్లూ మీడియాలో రాద్ధాంతం చేసి అది పోగొట్టేలా చేసింది జగనే



అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ చెప్పే మానవత్వం గురించి అతని తల్లీ, చెల్లిని చూస్తేనే అందరికీ అర్థమవుతుందన్నారు.

**దేశ బహిష్కరణ చేయాల్సిందే..**

దేశాన్ని కించపరుస్తున్న జగన్‌ను దేశ బహిష్కరణ ఎందుకు చేయకూడదని ప్రశ్నించారు. సెల్ఫ్ గోల్స్‌తో తనని దేశ బాహిష్కరణ చేయాల్సిన పరిస్థితి జగనే తెచ్చుకున్నారన్నారు. జగన్‌కు ప్రసాదం ఇస్తే టిష్యూ పేపర్‌లో చుట్టి పక్కన పెట్టేయటం, అక్షింతలు వేస్తే తలదులేపుసుకున్న సందర్భాలు ఎన్నో చూడలేదా అని అన్నారు.

**అన్నీ కట్టు కథలే..**

నిన్న జగన్ పర్యటన సందర్భంగా ఒక్కరినైనా బైండోవర్ చేశామా లేక గృనిర్బంధం చేశామా అని ప్రశ్నించారు. శాంతి భద్రతల పరిరక్షణకు సాధారణంగా అమల్లోకి తెచ్చే సెక్షన్ 30 యాక్ట్ తెస్తే తనకే అది జారీ చేసినట్లు జగన్ కథలు అల్లారని మండిపడ్డారు. దేవుడైనా తన గుమ్మం ముందుకు రావలనుకునే తత్వం జగన్‌ది కాబట్టే ఇంటి వద్ద గుడి సెట్టింగ్ వేసుకున్నారంటూ హెూంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# వెంకట్‌రెడ్డి లాంటి తీగలే కాదు.. పెద్ద డొంకలు సైతం కదలాలి

**అమరావతి :** గత జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై నిగ్గు తేల్చేందుకు చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అందులోభాగంగా గనులు, మైనింగ్ కేటాయింపులు, ఇసుక అక్రమ రవాణాలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై ఆ శాఖ డైరెక్టర్ వెంకట్‌రెడ్డిని ఏసీబీ అధికారులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. వెంకటరెడ్డి అరెస్ట్‌పై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం అమరావతిలో స్పందించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గనుల దోపిడీపై వెంకట్ రెడ్డి లాంటి తీగలే కాదు..పెద్ద డొంకలు సైతం కదల్చాల్సిన అవసరం ఉందన్నారు. ఆ పెద్ద డొంక ఏ ప్యాలెస్‌లో ఉన్నా విచారణ జరపాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రూ. 2,566 కోట్ల దోపిడీకి పాల్పడ్డ ఘనుడు వెంకట్‌రెడ్డి అయితే.. ఆ తెర వెనుక ఉండి, సర్వం తానై, వేల కోట్లు కాజేసిన ఆ ఘనాపాటి ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అడ్డగోలుగా సహజ సంపదను దోచుకు తిన్నారని గత ప్రభుత్వ పాలకులపై పీసీసీ చీఫ్ మండిపడ్డారు. అస్మదీయ కంపెనీలకే మైనింగ్ కాంట్రాక్టులు సైతం కట్టబెట్టారని ఈ సందర్భంగా విమర్శించారు.

టెండర్లు, ఒప్పందాలు, ఏపీఎంఎంసీ నిబంధనలన్ని తుంగలోకి తొక్కి తాము అనుకున్న కంపెనీకే టెండర్లు కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు సైతం బేఖాతరు చేశారన్నారు. రాష్ట్ర



ఖజానాకు చేరవలసిన నిధులు.. సొంత ఖజానాకు తరలించారని వైఎస్ షర్మిల ఆరోపించారు.

గత ప్రభుత్వ హయంలో జరిగిన మైనింగ్ కుంభకోణంపై ఏసీబీ విచారణతో పాటు పూర్తి స్థాయి సమగ్ర దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. చిన్న చేపలను ఆడించి సొమ్ము చేసుకున్న పెద్ద తిమింగలాన్ని పట్టుకొనేలా ఈ కేసులో దర్యాప్తు జరగాలని కూటమి ప్రభుత్వాన్ని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. సహజ వనరుల దోపిడీపై సీబీఐతో విచారణ కోరాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆమె సూచించారు.

"ఐదేళ్లుగా రాష్ట్రంలో అడ్డగోలుగా సహజ సంపదను దోచుకుతిన్నారు. అస్మదీయ కంపెనీలకు మైనింగ్ కాంట్రాక్టులు ఇచ్చారు... నిబంధనలను బేఖాతరు చేసి వారు అనుకున్న కంపెనీకి టెండర్లు కట్టబెట్టారు. ఎన్జీటీ నిబంధనలను సైతం తుంగలో తొక్కారు. రాష్ట్ర ఖజానాకు రావాల్సిన నిధులను సొంత ఖజానాకు తరలించారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన మైనింగ్ స్కాంపై ఏసీబీతో విచారణతో పాటు, సమగ్ర దర్యాప్తు జరిపించాలి. చిన్న చేపలను ఆడించి సొమ్ము చేసుకున్న పెద్ద తిమింగలాన్ని పట్టుకొనేలా దర్యాప్తు జరగాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. సహజ వనరులపై దోపిడీపై సీబీఐ విచారణ కోరండి" అంటూ షర్మిల ట్వీట్ చేశారు.

గత జగన్ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో భారీగా అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఆ క్రమంలో గనులు, అక్రమ మైనింగ్‌లో భారీగా అవినీతి చోటు చేసుకున్నట్లు చంద్రబాబు ప్రభుత్వం గుర్తించింది. దీంతో నాటి గనుల శాఖ డైరెక్టర్ వెంకట్ రెడ్డిని అరెస్ట్ చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్దం చేసింది. దీంతో ఆయన ఢిల్లీ కంటోన్మెంట్‌లో నెలలు తరబడి తలదాచుకున్నారు. ఈ విషయాన్ని కనిపెట్టిన ఏసీబీ సైతం అతడిని అరెస్ట్ చేసేందుకు చర్యలు చేపట్టింది.

ఈ విషయాన్ని వెంకట్ రెడ్డి పసిగట్టారు. దీంతో తన మకాం హైదరాబాద్‌లోని శంషాబాద్ సమీపంలోని అత్యంత ఖరీదైన బ్యూటీ గ్రీన్ ఫార్మ్ హౌస్‌కు మార్చారు. అతడి ఆచూకీ కనిపెట్టిన ఏసీబీ అతడిని శుక్రవారం అరెస్ట్ చేసింది. అనంతరం అతడిని కోర్టులో హాజరు పరచగా.. 14 రోజుల కస్టడీ విధించింది. ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారి అయిన వెంకట్ రెడ్డి.. డిప్యూటేషన్‌పై జగన్ ప్రభుత్వంలో గనుల శాఖలో ఉన్నతాధికారిగా చేరిన సంగతి తెలిసిందే.

# చంద్రబాబుపై మరోసారి నోరుపారేసుకున్న పేర్నినాని

కృష్ణాజిల్లా, సెప్టెంబర్ 28: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) నోరు పారేసుకున్నారు. చంద్రబాబు నోటిని ఆ వెంకటేశ్వర స్వామే శుద్ధి చేస్తున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిపై పాలకుల కలంకిత మాటలను నిరసిస్తూ మచిలీపట్నం బచ్చుపేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పేర్నినాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. నాని హాట్ కామెంట్స్ చేశారు. నిన్నటి వరకు తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిసిందని చంద్రబాబు నానా యాగీ చేశారన్నారు. నిన్నటి రోజున కల్తీ నెయ్యి దానిలో వాడారో తెలియదని అంటున్నారని తెలిపారు. దీనిబట్టి చూస్తుంటే కేవలం జగన్‌ను రాజకీయంగా అంతం చేసేందుకే చంద్రబాబు తిరుపతి లడ్డూపై కలంకితం మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం జగన్ తిరుపతి వెళతానంటే కొండపైన ఫ్లెక్సీలు పెట్టిస్తారా..!? అన్యమతస్థులు డిక్లరేషన్ ఇవ్వాలని ఏ నాడైనా తిరుపతి కొండపై ఫ్లెక్సీలు పెట్టారా..!? జగన్ తన పర్యటన వాయిదా వేసుకున్నాడని తెలిసిన వెంటనే ఆ ఫ్లెక్సీలు తీయించేస్తారా..!? కాషాయం దుస్తులు వేసుకున్న దొంగ భక్తులను జగన్ ఇంటికి పంపి గేట్లకు కాషాయం రంగులు పులుమిస్తారా..!?" అంటూ పేర్నినాని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

**డిక్లరేషన్‌పై జగన్...**

కాగా.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తిరుమల పర్యటనను రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. అనంతరం ఆయన ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. శ్రీవారి దర్శనానికి వెళ్లాలంటే డిక్లరేషన్ ఇవ్వాలని తనను డిమాండ్ చేయడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. "మనం ఎలాంటి దేశంలో నివసిస్తున్నాం? ఆలయంలో ప్రవేశించే వ్యక్తి తన మతమేంటో చెప్పాలా? ఇదేం దేశం.. ఇదేం హిందూయిజం" అని మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రశ్నించారు. "ఎలాంటి లౌకికవాదంలో, ఎలాంటి లౌకికదేశంలో మనం నివసిస్తున్నాం. ఇదెక్కడి హిందూత్వం.. ఇదేం హిందూయిజం" అని ప్రశ్నించారు. నాలుగ్గోడల మధ్య తాను బైబిల్ చదువుతానని స్పష్టం చేశారు. బయట హిందూ, ముస్లిం మతాలను గౌరవిస్తానని.. పార్శీ, సిక్కు మతాలనూ గౌరవిస్తానని చెప్పారు. తిరుమల వేంకటేశ్వరుడిని దర్శించుకుంటానంటే తన మతమేమిటని అడుగుతారా అని మండిపడ్డారు. తన మతం మానవత్వమని.. డిక్లరేషన్‌లో రాసుకోవాలంటూ టీటీడీకి సూచించారు. దేవాలయానికి వెళ్తే మతమేమిటని అడుగుతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడికి వెళ్తే మతమేంటో చెప్పాలనడమే హిందూత్వమా అని ప్రశ్నించారు.

## చంద్రబాబును దేవుడే శిక్షిస్తాడు

-మొదటిపేజీ తరువాయి

కల్పించారన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో తప్పు జరిగి ఉంటే తప్పకుండా శిక్షించాలన్నారు. చంద్రబాబు చేసింది తప్పు కాబట్టి హైకోర్టు, సుప్రీం కోర్టు, సీబీఐకు విచారణ జరిపించాలని లేఖ రాయలేకపోతున్నారని వ్యాఖ్యలు చేశారు. సామాన్యులు భక్తులు ఇబ్బంది పడతారని తిరుపతి పర్యటనపై నిర్ణయం తీసుకున్నారని వివరణ ఇచ్చారు. వెంకటేశ్వర స్వామి ప్రసాదంతో రాజకీయం చేయడం ధర్మనేనా అని ప్రశ్నించారు. చంద్రబాబుకు దమ్ము ధైర్యం ఉంటే సుప్రీంకోర్టు, హైకోర్టు, సీబీఐలకు విచారణ జరిపించాలని లేఖ రాయాలని అన్నారు.

**స్టీల్‌ప్లాంట్‌పై ఇలా...**

స్టీల్ ప్లాంట్‌లో 4 వేల మంది కార్మికులను తొలగిస్తే దానికి సమాధానం చెప్పేవారు లేరన్నారు. ఎన్నికలకు ముందు స్టీల్ ప్లాంట్ కోసం ఏం చెప్పారని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుకున్నాయన్నారు. బియ్యం కూడా కొనుక్కొనే పరిస్థితి ప్రజలకు లేదని విమర్శించారు. చారు అన్నం కూడా తినే పరిస్థితి లేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 25 వేల కోట్లు అప్పు చేశారని... అప్పులు చేయడమేనా సంపద సృష్టి అంటే అని నిలదీశారు. సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు.

## అదే వాస్తవం.. టీటీడీ లడ్డూ వివాదంపై కేంద్రమంత్రి



**న్యూఢిల్లీ :** టీటీడీ లడ్డూ వివాదంపై కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి వచ్చాక తిరుపతి ప్రతిష్ఠ దిగజారిందన్నారు. గతంలో దేవలయాలపై దాడులు జరిగితే ఒక్కరిపైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రామ తీర్థంలో రాముడి తల తీశారని.. అంతర్వేదిలో రథం దగ్ధం చేశారన్నారు. కొవ్వు పదార్థాలు కలిసిన నెయ్యిని దిగుమతి చేసుకున్నారన్నది వాస్తవమని స్పష్టం చేశారు. లాబ్ రిపోర్ట్స్ ఉన్నాయన్నారు. గతంలో ఏడు కొండలను రెండు కొండలు చేద్దామనుకున్న వ్యక్తి రాజశేఖర్ రెడ్డి అని అన్నారు. హిందు ధర్మం ప్రకారం దంపతులు పట్టు వస్త్రాలు ఇచ్చేవారని.. కానీ జగన్ ఒక్కరే ధర్మానికి వీరుద్ధంగా పట్టు వస్త్రాలు ఇచ్చారని తెలిపారు. డిక్లరేషన్ ఇవ్వాలన్నది చాలా సంవత్సరాలుగా ఉన్న నిబంధన అని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టి డిక్లరేషన్ ఇవ్వకుండా తిరుపతి వెళ్లారన్నారు. లడ్డూ విషయంలో తొమ్మింది మందితో సిట్ ఏర్పాటు చేశారని.. లడ్డూ విషయంలో అవకతవకలు బయటకు వస్తాయన్నారు. తిరుమల అవకతవకలపై సిట్ దర్యాప్తు చేసి నివేదికను ప్రభుత్వం ముందు ఉంచుతుందని భవిస్తున్నట్లు తెలిపారు. వైసీపీ హయాంలో టీటీడీని తన కుటుంబ సభ్యుల ఆధీనంలో పెట్టుకున్నారని ఆరోపించారు. తిరుపతిని జగన్ కుటుంబ సభ్యుల చేతుల్లో పెట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. స్వామి వారిని కించపరిచే వారు బయటపడరని.. అవసరమైతే కేంద్రం తన వంతు పాత్ర పోషిస్తుందన్నారు. టీటీడీ లడ్డు వివాదంపై ఇప్పటికే కావాల్సిన వివరాలను కేంద్రం అడిగిందని కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ వెల్లడించారు.

**విశాఖ స్టీల్ ప్లాంట్‌పై..**

విశాఖ ఉక్కు పరిశ్రమలో పెట్టుబడుల ఉపసంహరణ విషయంలో ప్రజల సెంటిమెట్లను నిలబెట్టేలా ప్రయత్నిస్తున్నామని కేంద్రమంత్రి చెప్పారు. స్టీల్ ప్లాంట్ విషయంలో కొత్త ప్రక్రియ ఏమి లేదని స్పష్టం చేశారు. 2014 ముందు ఉన్న ప్రభుత్వం నిర్ణయాలపైనే ప్రస్తుతం చర్చ జరుగుతుందన్నారు. ఉద్యోగుల భద్రత,సెంటిమెంట్లకు ప్రాధాన్యత ఇస్తున్నామని.. ప్రత్యామ్నాయాల గురించి ఆలోచన చేస్తున్నామన్నారు. వాస్తవ పరిస్థితులు పరిశీలన చేసి శాశ్వత పరిష్కారం కోసం పని చేస్తున్నామని తెలిపారు. ప్యాకేజీలతో తాత్కాలిక ఉపశమనం కాకుండా శాశ్వత పరిష్కారం కోసం పనిచేస్తున్నామని అన్నారు. ఆర్థిక మంత్రి నుంచి ప్రధాని దృష్టికి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ముందుకు తీసుకెళ్లాలని, ఉద్యోగులకు నష్టం కలగకుండా చూడాలని ఆలోచన చేస్తున్నామన్నారు. సెయిల్ ఆధ్వర్యంలో ఉన్న పరిశ్రమలు లాభాల్లో ఉన్నాయన్నారు. అవసరం లేకపోయినా విస్తృతపరచడం, గత పాలకుల నిర్ణయాలు, రాయబరేలిలో పరిశ్రమలు పెట్టడం, వేల కోట్లు పెట్టుబడులు పెట్టడం వల్ల స్టీల్ ప్లాంట్ నష్టాల్లోకి వెళ్ళిందన్నారు. నష్టాలను భరించడం కేంద్ర ప్రభుత్వానికి సాధ్యం కాదని వెల్లడించారు. కేంద్రం సాయం చేస్తూ పరిశ్రమను లాభల్లోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇది ప్రజా ధనం.. నష్టాల్లో ఉన్న పరిశ్రమ కోసం నిధులు ఖర్చు చేసే పరిస్థితి లేదని తెలిపారు. ఆర్థికమంత్రికి స్టీల్ ప్లాంట్‌పై అవగాహన ఉందన్నారు. సెయిల్, ఎన్ఎండీసీ అధికారులతో సమావేశం అయ్యానని.. సెయిల్ ఆధ్వర్యంలో ఉన్న పరిశ్రమలు లాభాల్లో ఉన్నాయని. కొన్ని అంశాలపై చర్చించినట్లు తెలిపారు. నష్టాల్లో ఉన్న పరిశ్రమను విలీనం చేసే సమయంలో సాంకేతిక సమస్యలు ఉంటాయని..వాటిని అధిగమించాలనే అంశంపై సెయిల్ అధికారులతో చర్చ జరిపానన్నారు. ఆర్ఐఎన్ఎల్ దగ్గర అదనంగా ఉన్న 1500 ఎకరాల భూమిని ఎన్ఎండీసీకి ఇచ్చి ఆర్థిక సహకారం, పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే దానిపై ఎన్ఎండీసీ సంస్థతో చర్చించినట్లు తెలిపారు. కార్మికులు ఆందోళన చెందడం సహజమని.. సాధ్యాసాధ్యాలను అర్థం చేసుకోవాలన్నారు. ఉద్యోగులు, కార్మికులను తప్పు పట్టడం లేదని తెలిపారు. ఉత్పత్తి ఎంత.. కార్మికులు ఎంత అన్న సమాచారం తీసుకున్నామన్నారు. మిగతా సంస్థలతో పోలిస్తే విశాఖ స్టెల్ ప్లాంట్‌లో కార్మికులు ఎక్కువ ఉన్నారని.. ఉత్పత్తి తక్కువగా ఉందన్నారు. కార్మికులను బాధ్యులను చేయలేమన్నారు. సమర్ధవంతమైన అధికారులను నియమించామని తెలిపారు. పనిలేనప్పుడు కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించక తప్పదన్నారు. నష్టాలు భరించే పరిస్థితి ప్రభుత్వానికి లేదని.. శాశ్వత పరిష్కారం కోసం పనిచేస్తున్నామని కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ వెల్లడించారు.

## తిరుమలలో సిట్ బృందం పర్యటన..
## శ్రీవారిని దర్శించుకున్న సభ్యులు



**అమరావతి :** తిరుమలలో శ్రీవారిని సిట్ బృందం చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శనివారం దర్శించుకున్నారు. విజయవాడ నుంచి బయలు దేరిన ఆయన తిరుపతికి వెళ్లి అక్కడి నుంచి తిరుమలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ సమీపంలో తయారవుతున్న లడ్డూల తయారీని , వాడుతున్న సరుకులను చీఫ్ త్రిపాఠి పరిశీలించారు. ఆయన వెంట సభ్యులు సీతారామారావు, నారాయణ స్వామి తదితరులున్నారు. సాయంత్రం టీటీడీ ఈవోతో శ్యామలారావును కలిసి వివరాలు తెలుసుకోనున్నారు. తిరుమల లడ్డూ తయారిలో ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిందని ఆరోపిస్తూ ఆందోళనను జరుగుతున్న కల్తీ వ్యవహారాన్ని తేల్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దర్యాప్తు కోసం సిట్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం



## జడ్పీ సీఈఓ గా చిరంజీవి నియామకం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)
ప్రకాశం జిల్లా జడ్పీ సీఈఓగా నూతనంగా శనివారం చిరంజీవి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఒంగోలులోని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## గిరిజనుల, ఆదివాసిల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం

### జటోత్ హుస్సేన్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)
గిరిజనులు, ఆదివాసీల సమస్యలు, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా చూసి, వారి సమస్యల పరిష్కారానికి జాతీయ షెడ్యూల్డ్ తెగల కమీషన్ కృషి చేస్తున్నట్లు కమీషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ పేర్కొన్నారు. శనివారం కొత్తపట్నం మండలం, రంగాయపాలెంలోని తుఫాన్ రక్షిత భవనంలో ఆ ప్రాంత యానాదివాసులతో జాతీయ షెడ్యూల్డ్ తెగల కమీషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ సమావేశమై వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆ ప్రాంత యానాది వాసులు మాట్లాడుతూ,



## గుర్రం జాషువా రచనలు అందరికీ స్ఫూర్తిదాయకం

### కలెక్టర్ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)
కులవివక్ష, సామాజిక అసమానతలపై గుర్రం జాషువా చేసిన అలుపెరుగని పోరాటం మనందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అన్నారు. జాషువా 129వ జయంతిని పురస్కరించుకొని గుర్రం జాషువా సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ప్రకాశం భవనంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎస్.పి. ఏ.ఆర్. దామోదర్ తో కలిసి ఆమె పాల్గొన్నారు. జాషువా విగ్రహానికి వారు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంఘ సంస్కరణ కోసం సాహిత్యాన్ని ఆయుధంగా వాడుకొని జాషువా ఎన్నో గొప్ప రచనలు చేశారని కొనియాడారు. కవిగా, స్వాతంత్ర్య పోరాట యోధునిగా, సంఘ సంస్కర్తగా విశేష కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన జాషువాను స్మరించుకోవడం గొప్ప విషయమన్నారు. ఎస్.పి. మాట్లాడుతూ కవిగా, మానవతావాదిగా సామాజిక అభ్యున్నతికి (తరువాయి 4లో...)

## నా కల నెరవేరింది

### రూ.75 కోట్లతో శరవేగంగా అభివృద్ధి పనులు

### రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, సెప్టెంబర్ 28)
తాను అనుకున్న విధంగా రూరల్ నియోజకవర్గం చేయలేనంత అభివృద్ధి తాను చేస్తున్నట్లు రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం రూరల్ నియోజకవర్గంలోని బుజ్జి నెల్లూరు నేషనల్ హైవే నందు రూ.75 కోట్ల రూపాయల నిధులతో నిర్మిస్తున్న బైపాస్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, సర్వీస్ రోడ్ల పనులు ఆయన పరిశీలించారు. తాను మొట్టమొదటిగా 2014లో ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నెల్లూరు నేషనల్ హైవేలో బుజబుజ నెల్లూరు కనుపర్తిపాడు మెడికవర్ హాస్పిటల్ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ అండర్ పోస్టుల నిర్మాణం అత్యంత అవసరం అని ప్రయత్నాలు చేయడం జరిగిందన్నారు. అప్పటి కేంద్ర మంత్రి ముప్పవర వెంకయ్య నాయుడు (తరువాయి 4లో...)

4

## పోలీస్ సిబ్బంది ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

### ఎస్పీ ఏఆర్ దామోదర్

### జిల్లా పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు స్పెషలిస్ట్ డాక్టర్లచే పలు వైద్య పరీక్షలు నిర్వహణ, మందుల అందజేత

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టెంబర్ 28)
"వరల్డ్ హార్ట్ డే" సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఒంగోలు పట్టణంలోని కిమ్స్ హాస్పిటల్స్ వారి సహకారంతో శనివారం జిల్లా పోలీస్ కళ్యాణ మండపంలో పోలీసు సిబ్బంది, హోమ్ గార్డ్స్, డిపిఓ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు, ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, పల్మోనాలజీ, అర్థోపెడిక్, ఎండోక్రైనాలజీ, డెంటల్,ఆప్తమాలజీ, కార్డియో తోరాసిక్ వాస్క్యులర్ సర్జన్, షుగర్ , థైరాయిడ్, జనరల్ సర్జరీ, బిఎండి టెస్ట్, ఈసీజీ, జనరల్ మెడిసిన్, మొదలైన విభాగాలకు చెందిన నిపుణులైన డాక్టర్లు బృందంచే 474 మందికి పలు వైద్య పరీక్షలు నిర్వహించి, తగిన చికిత్స చేసి ఉచితంగా మెడిసిన్ అందించారు. ఈ సంధర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు వలన గుండె సంబంధిత సమస్యలు ఎక్కువ అవుతున్నాయని, కావున పోలీసు సిబ్బంది గుండె సంరక్షణ, హార్ట్ సంబంధిత వ్యాధులు వాటికి చికిత్స మరియు గుండెపోటుకు గురైన వ్యక్తిని ఎలా గుర్తించి ప్రాథమికంగా చేయాల్సినవి సీపీఆర్ విధానాలపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు. గుండె ఆరోగ్యకరమైన స్థితిలో ఉంచడానికి మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ఒత్తిడికి దూరంగా ఉండాలని, సకాలంలో వైద్య పరీక్షలు చేయించి, ఆరోగ్యపరమైన సమస్యలను ముందస్తుగా గుర్తించి తగిన చికిత్స తీసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజా క్షేత్రంలో నిత్యం ప్రజల సేవకే అంకితమైన పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. పోలీస్ సిబ్బంది (తరువాయి 4లో...)






# పోలీస్ సిబ్బంది ఆరోగ్య సంరక్షణే ధ్యేయం







దేహదారుఢ్యంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, పోలీసులు ఆరోగ్యంగా, ఫిట్ నెస్ తో ఉంటనే కుటుంబం, సమాజం బాగుంటుందన్నారు. ఉచిత వైద్య శిబిరానికి సహకరించి ఎక్కువ సంఖ్యలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేపించుకున్న సిబ్బందిని జిల్లా ఎస్పీ గారు అభినందించారు. ఉచిత మెగా వైద్య శిబిరానికి పిలువగానే వచ్చిన వైద్య బృందానికి జిల్లా ఎస్పీ గారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటుకు కృషి చేయించిన జిల్లా ఎస్పీ కి, కిమ్స్ డాక్టర్లకు పోలీసు కుటుంబాల వారు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ ఐ.డి కార్డు ద్వారా ఓ.పి ద్వారా తమ హాస్పిటల్ లో చూపించుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు మరియు ల్యాబ్ పరీక్షల పైన 50% డిస్కౌంట్ ఇస్తున్నట్లు ఈ మెడికల్ క్యాంపులో కిమ్స్ హాస్పిటల్ వారు తెలిపారు. అనంతరం కిమ్స్ హాస్పిటల్ వారు జిల్లా పోలీస్ శాఖ కు బ్లడ్ సెల్ కౌంటర్ మెషిన్ ఉచితంగా అందచేసినారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో హాస్పిటల్ కి సంబంధించి రూమ్స్ కు ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కిమ్స్ హాస్పిటల్ వారు ఈ మెడికల్ క్యాంపులో ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు యస్.వి.శ్రీధర్ రావు, కె.నాగేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఎఆర్ డిఎస్పీ చంద్ర శేఖర్, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, కిమ్స్ ఎక్సిక్యూటివ్ డైరెక్టర్ టి. గిరి నాయుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అంకిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ శ్రీహరి రెడ్డి, వైద్యులు లక్ష్మణ్ రెడ్డి, కపిల్ కార్తికేయ రెడ్డి, పోలీస్ యూనిట్ డాక్టర్ భానుమతి, డీపీఓ ఎ ఓ సులోచన, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, రమణా రెడ్డి, సీతారామరెడ్డి, పోలీస్ సిబ్బంది, కిమ్స్ హాస్పటల్ డాక్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## జీవీఎస్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర 2047 అవగాహన కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 28)

మండల కేంద్రమైన ఉలవపాడు జి.వి.ఎస్.ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర 2047 పై విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, అన్ని రంగాలలో ప్రగతి పథంలో నడవాలని ముఖ్యంగా విద్యార్థినీ,విద్యార్థులు భాగస్వామ్యం కావాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎల్ సుధారాణి, కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు సూచించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం వారు అందించిన క్యూఆర్ కోడ్ ద్వారా అడిగిన ప్రశ్నలకు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు వారి సలహాలను, సూచనలను పొందుపరచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతకం ఉన్న సర్టిఫికెట్లు కూడా పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజనుల, ఆదివాసిల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం







బకింగ్ హామ్ కెనాల్ ను ఆధారంగా చేసుకుని చేపలు పట్టే వారికి లైసెన్సు లు మంజూరు చేయాలని కమీషన్ సభ్యులు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కమీషన్ సభ్యులు హుస్సేన్ స్పందిస్తూ వెంటనే బకింగ్ హామ్ కెనాల్ పరిధిలో చేపలు పట్టే వృత్తి పై ఆధారపడి జీవించే వారికి లైసెన్సు లు మంజూరు చేయాలని, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ని ఆదేశించగా, నెల రోజుల లోపు డోర్ టు డోర్ వెరిఫికేష చేసి అర్హత ఉన్న వారికి లైసెన్సు మంజూరు చేయుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా మత్స్య శాఖ జేడి, కమీషన్ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా కమీషన్ సభ్యులు హుస్సేన్ మాట్లాడుతూ, ఎస్సి., ఎస్టి ల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేయడం జరుగుచున్నదని, ఆ సంక్షేమ పథకాలు ఆయా వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకొని జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలని కమీషన్ సభ్యులు, కాలనీ వాసులకు సూచించారు. షెడ్యూల్డ్ తెగల కమీషన్ ఉందన్న విషయాన్ని చాలా షెడ్యూల్డ్ తెగల వారికి తెలియదని, షెడ్యూల్ తెగల ప్రజలకు కమీషన్ గురించి తెలిసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారికి సూచించారు. బకింగ్ హామ్ కెనాల్ పరిధిలో చేపలు పట్టే ఈ కాలనీవాసులు కోరుతున్న విధంగా ఖచ్చితంగా లైసెన్సు మంజూరు చేయాలని మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే పట్టిన చేపలను తెచ్చుకునేలా వారికి ఎలక్ట్రికల్ వాహనాలను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలనీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్డిఓ సుబ్బారెడ్డి, మత్స్య శాఖ జేడి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జగన్నాథ రావు, కొత్తపట్నం తహశీల్దార్ మధుసూధన్ రావు, జిల్లా ఎస్ సి., ఎస్ టి విజిలెన్స్ సభ్యులు, యానాది కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## గుర్రం జాషువా రచనలు అందరికీ స్ఫూర్తిదాయకం

గుర్రం జాషువా చేసిన కృషి ఎంతో విలువైనదని పేర్కొన్నారు. ఐ.ఏ.ఎస్.. ఐ.పి.ఎస్. వంటి సివిల్ సర్వీసులకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు కూడా జాషువా రచనలు పాఠ్యాంశాలుగా ఉన్నాయని, సామాజిక సంస్కర్తగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ఎస్.పి. కొనియాడారు. అనంతరం జరిగిన సభలో జాయింట్ కలెక్టర్



ఆర్.గోపాలకృష్ణ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. తెలుగు సాహిత్య రంగంపై గుర్రం జాషువా తనదైన ముద్ర వేశారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, డి.ఎం.హెచ్.ఓ .సురేష్ కుమార్. గుర్రం జాషువా సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య, కార్యదర్శి ఎండ్లూరి రవికుమార్, ఎం.ఆర్.పి.ఎస్. రాష్ట్ర కో-కన్వీనర్ పానుగంటి షాలేమురాజు, ప్రకాశం జిల్లా అద్యక్షులు రావినూతల కోటి, ఎం.ఎస్.పి.ఎస్. అద్యక్షులు కొమ్ము సుజన్, కవులు తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ అండర్ -17, 14 విభాగంలో నిర్మలా కాన్వెంట్ విద్యార్థుల ఎంపిక



(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 28)

పొదిలి నిర్మలా కాన్వెంట్ విద్యార్థులు ఈ నెల 25వ తేదీన మార్కాపురంలో జరిగిన నియోజకవర్గం స్థాయి స్కూల్ గేమ్స్ టోర్నమెంట్‌లో పాల్గొని వాలీబాల్ అండర్ -17 , అండర్-14 విభాగంలో విజయం సాధించి జిల్లా వాలీబాల్ టీం కి అండర్ -17 లో పి. చరణ్, డి. హర్షవర్ధన్ పి. బ్రహ్మ చరణ్ , అండర్-14 విభాగంలో ఏ. సాత్విక్, వ. జీవన్ , వ.చందులు ఎంపికయ్యారు. విద్యార్థులను , వ్యాయామ ఉపాధ్యాయుడు కె. స్టీఫెన్‌ను కరెస్పాండంట్ సిస్టర్ రూబీ, హెడ్మిస్ట్రెస్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## నూకసాని బాలాజీని కలిసిన పొదిలి మండల టీడీపీ నేతలు




(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 28)

ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీని పొదిలి మండల టీడీపీ నాయకులు పలువురు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాలాజీని సత్కరించిన వారిలో మాజీ జెడ్పిటిసి కాటూరి వెంకట నారాయణబాబు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ శివాలయం చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, టిఎన్ఎస్ఎఫ్ మాజీ అధ్యక్షుడు మావిళ్ళపల్లి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు తానికొండ వెంకటరావు, తలమల్ల వెంకట్రావు, ముని శ్రీను, తదితరులు ఉన్నారు.

## నా కల నెరవేరింది



సహాయ సహకారాలతో అడుగులు వేశానన్నారు. రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కార్యరూపం దాల్చారు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరైన అధికార పార్టీ నుండి దూరం జరిగాక పనులు వేగవంతంగా సాగలేదన్నారు. ఇప్పుడు మూడోసారి ఎమ్మెల్యేగా గెలవడంతో చంద్రబాబు నాయుడు సహకారంతో పార్లమెంటు సభ్య లు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి యుద్ధ ప్రాతికపదిన పనులు జరుగుతున్నాయి అన్నారు. ఈ నెలలో పనులు పూర్తవుతాయన్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసినందుకు ఎన్హెచ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం కె చౌదరి కి నెల్లూరు జిల్లా ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా గుర్రం జాషువా 129 వ జయంతి

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 28)



మాచర్ల నియోజకవర్గంలోని గుర్రం జాషువా విగ్రహం దగ్గర 129వ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించడం జరిగింది. దళిత బహుజన బీమ్ సేన, డప్పు, జానపద కళాకారుల ఆధ్వర్యంలో దళిత బహుజన భీమ్సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి మాట్లాడుతూ గుర్రం జాషువ 129వ జయంతి ఏర్పాటు చేయడం జరిగింది. వినుకొండ మండలం చాత్రగడ్డ పాడులో 28-9-1895 గుర్రం వీరయ్య లింగమ్మ దంపతులకు పుట్టడం జరిగింది. ఆయన బాల్యం అంత వినుకొండ మండలం చాటగడ్డపాడు గ్రామంలో చదువుకోవడం జరిగింది. అదేవిధంగా అంటరానితనాన్ని అతను చదువుకునే పాఠశాలలో ఎదుర్కోవడం జరిగింది. విద్య ద్వారానే సమాజంలో మానవవిలువ లూ ఉంటాయని ఆయన ఎన్నో రచనలు చేశాడు. ఆధునిక కవులలో స్థానం పొందిన కవి గుర్రం జాషువా. ఆయన రచనలు,గబ్బిలం నేతాజీ,పిర దౌశీ,బాపూజీ. స్వయంవరం,ముంతాజ్ మహల్,ఆయన పొందిన ఎన్నో బిరుదులకు, సత్కారాలు అందుకున్నాడాయన. కవిత విశారద, కవి కోకిల, కవిదిగ్గజ, నవయుగ కవి చక్రవర్తి, మధుర శ్రీనాథ, విశ్వకవి సామ్రాట్‌గా ప్రసిద్ధి అయ్యాడు. 1970 సంవత్సరంలో భారత ప్రభుత్వము ఆయనకు పద్మభూషణ్ పురస్కారం ఇవ్వడం జరిగిందన్నారు. డప్పు,జానపద కళాకారుల వ్యవస్థాపక అధ్యక్షులు ఆదిరాల ఆదాము మాట్లాడుతూ ఆయన ఎన్నో అవార్డులు తీసుకోవడం జరిగింది. ఆయన మహాకవి గుర్రం జాషువా ఆయన రచనల ద్వారా సమాజంలో ఉన్న అంటరానితనాన్ని పోగొట్టాలంటే ఒకటి పేదరికం రెండు అంటరానితనం పోవాలి అంటే చదువుకోవాలని చెప్పిన మహనీయుడు. 1964 సంవత్సరంలో క్రీస్తు చరిత్ర కేంద్ర సాహితీ అకాడమీ ద్వారా ఆయన పురస్కారం తీసుకోవడం జరిగింది. అదే సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యుడిగా నియమితుడయాడు అని అన్నారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర ప్రజా హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గురజాల అప్పారావు మాట్లాడుతూ ఆయన కవిత్వాలు ద్వారా ఆయన రచనల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ ఆయన ఒక మహా కవిగా మనం చెప్పుకోవటం ఎంతో ఆనందంగా ఉందని అనిఅన్నారు. మన పల్నాడు వాసైనటువంటి గుర్రం జాషువా అని ఎంతో గర్వంగా ఉందని అన్నారు. చాకలి ఐలమ్మ సేవా సమితి సభ్యులు వ్యవస్థాపక అధ్యక్షులు మన్నెం పాండురంగారావు మాట్లాడుతూ మన పల్నాడు వాసిఅయిన గుర్రం జాషువా ఈరోజు ఆయన చేసిన రచనలు కవిత్వాలు పద్యాలు జనాలు ఆకర్షించే విధంగా రాయటం గుర్రం జాషువా 129వ జయంతి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. మాచర్ల నియోజకవర్గం బీసీ సంఘం నాయకురాలు కొరదల జ్యోతి మాట్లాడుతూ గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా తక్కువ కులంగా భావింపబడ్డ కులంలో జన్మించినందు వలన అనేక అవమానాలు ఎదుర్కొన్నాడు. అయితే కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని ఈ మూఢాచారాలపై తిరగబడ్డాడు. జాషువా చిత్కారాలు అందుకున్న చోటే సత్కారాలు అందుకున్నాడు. ఆయనను మనం మహాకవిగా చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. దళిత బహుజన మహిళ నాయకురాలు కడియం శారమ్మ,వేల్పుల పిచ్చయా, ఖమ్మం పాటి యోహాను,తదితరులు పాల్గొన్నారు.

## నూకసాని బాలాజీని కలిసిన తాళ్ళపల్లి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం మున్సిపాల్టీ, సెప్టెంబర్ 28)

రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులై బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నూకసాని బాలాజీని శనివారం జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి తాళ్ళపల్లి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్ళపల్లి వెంట టీడీపీ నాయకులు రాచపూడి నాగరాజు, ఆలంపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన ఏ.కే.యూ.సహా ఆచార్యులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్శిటీలో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న ఇద్దరు సహా ఆచార్యులకు ప్రొఫెసర్లుగా పదోన్నతిని కల్పిస్తూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం ఉత్తర్వులను ఇచ్చారు. వివరాలలోకి వెళితే.... ఒకటిన్నర సంవత్సరం క్రితం ఒంగోలులో ఏర్పాటు చేయబడిన ఆంధ్ర

## అభినందనలు తెలిపిన వి.సి, రిజిస్ట్రార్

కేసరి యూనివర్శిటీ ఒకప్పుడు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్నాత కోత్తర కేంద్రంగా ఉంది. సదరు కేంద్రంలో అసోసియేట్ ప్రొఫెసర్లు గా పని చేస్తున్న వారిలో ఏ.కే.యూ.వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.నిర్మలా మణి, డీన్ సిడిసి డాక్టర్ జి.సోమ శేఖర తదితరులకు ఏ.ఎన్.యూ. ప్రమోషన్ ప్యానెల్ కమిటీ ప్రొఫెసర్లుగా ఎంపిక చేయడం జరిగింది. దీంతో ఇప్పటి వరకూ అసోసియేట్ ప్రొఫెసర్లుగా ఉన్నటువంటి డాక్టర్ నిర్మలా మణి, డాక్టర్ సోమ శేఖర తదితరులు ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. ఎకనామిక్స్ డిపార్టుమెంటు లో 30 సంవత్సరాల వరకు ప్రొఫెసర్ నిర్మలా మణికి అనుభవం ఉన్న విషయం తెలిసిందే. అదే విధంగా ప్రొఫెసర్ సోమ శేఖరకు హిస్టరీ డిపార్టుమెంటు లో 25 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ద్వారా ప్రొఫెసర్లుగా పదోన్నతి పొంది, ప్రస్తుతం ఆంధ్ర కేసరి యూనివర్శిటీ వివిధ స్థాయిలలో పని చేస్తున్న ప్రొఫెసర్ ఎన్.నిర్మలా మణి, ప్రొఫెసర్ జి.సోమ శేఖర తదితరులను ఆంధ్ర కేసరి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. హరిబాబు తదితరులు హృదయ పూర్వకంగా అభినందించారు. వీరిరువురూ భవిష్యత్‌లో ఇంకా అత్యున్నత మైన స్థాయిలకు చేరు కోవాలని వి.సి,రిజిస్ట్రార్ తదితరులు ఆకాంక్షించారు. ఆంధ్ర కేసరి యూనివర్శిటీ నందు వివిధ విభాగాలలో పని చేస్తూ, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ద్వారా ప్రొఫెసర్లుగా పదోన్నతులను పొందిన ప్రొఫెసర్ ఎన్.నిర్మలా మణి, ప్రొఫెసర్ జి.సోమ శేఖర తదితరులను ఆంధ్ర కేసరి యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. రాజ మోహన రావు, ఏ.సి.ఈ. డాక్టర్ బి.పద్మజ, డీన్ అకడమిక్స్ డాక్టర్ కే. గంగాధర్, హిస్టరీ డిపార్టుమెంటు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.వేంకటేశ్వర రెడ్డి, ఏ.కే.యూ. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీ వరప్రసాద్,ఏ.కే.యూ. ఎన్.ఎస్.ఎస్.కో ఆర్డినేటర్ డాక్టర్ మండే.హర్ష ప్రీతం దేవ్ కుమార్, కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ కే.శివాజీ, డాక్టర్ వనిత, సోషల్ వర్క్ విభాగం హెచ్.ఓ.డి.డాక్టర్ పిల్లి.వెంకటరావు, ఇంజనీరింగ్ విభాగం ఇన్చార్జి డాక్టర్ ఆర్.శ్రీనివాస్, పలువురు బోధన, బోధనేతర సిబ్బందితో బాటు పదోన్నతి పొందిన ప్రొఫెసర్ల బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు, పూర్వ విద్యార్థులు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.

# జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌ని కలిసిన బహుజన గిరిజన ఐక్యవేదిక



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

ప్రకాశం జిల్లా పర్యటనలో భాగంగా జిల్లాకు విచ్చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌ని మర్యాద పూర్వకంగా యన్ఎస్ పిగెస్ట్ హౌస్ నందు కలిసి బోకె అందజేసిన బహుజన గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గంటా సుబ్బా లక్కీ పోగు వెంకట్రావు అనంతరం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యునికి జిల్లాలో ఎస్టీలపై దాడులు స్థితిగతులను వివరించారు. ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో గత రెండేళ్ల నుంచి రిలీఫ్ విడుదల చేయలేదని, దాని వలన బాధితులు మనోధైర్యం కోల్పోయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని దీనిపై సత్వరమే బాధ్యతలకు న్యాయం జరిగేలా జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి లక్కీ పోగు వెంకట్రావు, ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ బాలాజీ నాయక్ ,డాక్టర్ లక్ష్మానాయక్ , గిరిజన నాయకులు రాపూర్ శ్రీనివాసులు ,చల్లా శ్రీధర్ ,బాబు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఉలవపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా గుర్రం జాషువా జయంతి



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 28)

మండల కేంద్రమైన ఉలవపాడు జి.వి.ఎస్.ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో గుఱ్ఱం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. తెలుగు అధ్యాపకుడు వై సుధాకర బాబు మాట్లాడుతూ జాషువా జీవిత విశేషాలను, నాటి సామాజిక వ్యవస్థలో జాషువా ఎదుర్కొన్న వివక్షత గురించి వివరించారు. తెలుగు సాహిత్యంలో గుఱ్ఱం జాషువా వైశిష్ట్యాన్ని గురించి తెలిపి, ఆయన రచనల గురించి వివరించారు. విద్యార్థులందరూ జాషువా రచనలు చదివి సామాజిక సమానత్వానికి, తెలుగు సాహిత్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు , ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# నాయకుని అభయాంజనేయ స్వామి సన్నిధిలో ధారపనేని, గుత్తి రాజా



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, సెప్టెంబర్ 28)

పామూరు పరిసర ప్రాంత ప్రజలు ఎంతో భక్తి పారవశ్యంతో కొలిచే నాయకుని దేవస్థానం శ్రీ అభయాంజనేయ స్వామి సన్నిధిలో శనివారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు బాలాజీ జువెలర్స్ అధినేత గుత్తి వెంకటరాజా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చి వరములను ప్రసాదించే అభయాంజనేయ స్వామి దర్శనము ఎంతో పుణ్యాత్మకమని, దేవస్థానం ప్రధాన అర్చకులు వితపు కుమారస్వామి తెలిపారు. దేవస్థానంలో గుత్తి వెంకటరాజా ధర్మపత్ని బుజ్జమ్మ దంపతులు భక్తులకు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ప్రారంభించారు. నరసింగు సాంబశివరావు, బండ్ల నారాయణ, గద్దె సుబ్బయ్య, మిరియం సుబ్బరాయుడు, మట్లి రాహుల్ యాదవ్, పోక నాయుడు బాబు స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

# విద్యార్థులు సమాజాభివృద్ధికి దోహదపడాలి

– ఆంధ్ర కేసరి యూనివర్సిటీ అసిస్టెంట్ – ప్రొఫెసర్ హర్ష ప్రీతం దేవకుమార్ పిలుపు






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

విద్యార్థులు చదువుతోపాటు సమాజాభివృద్ధికి దోహదపడాలని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ప్రకాశం జిల్లా జనరల్ కౌన్సిల్ శనివారం ఒంగోలులోని మాదాల నారాయణ స్వామి భవనంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య ఉపన్యాసకులుగా విచ్చేసిన హర్ష ప్రీతం దేవ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే అన్ని రంగాలలో విద్యార్థులే కీలకమని, భారతదేశంలో కూడా ఉన్న సహజ వనరులను ఉపయోగించుకొని విద్యార్థులు ముందుకెళ్తున్నారన్నారు. సమాజ శ్రేయస్సు కొరకు ఏ పోరాటం చూసిన విద్యార్థులే కీలకమన్నారు. సామాజిక సంఘసంస్కర్తలు అయిన జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సహిత్ భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. ఐఫియ నాయకులు ఎం.రాఘవరావు మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుంచి శాస్త్రీయ విద్యాసాధన కోసం, సమసమాజ స్థాపన కోసం పోరాడుతున్న పీడీఎస్‌యు ఈ 50 సంవత్సరాల కాలంలో అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సమాజంలోని అన్ని రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాల నుంచి జిల్లాలో జరిగిన ఉద్యమాన్ని సమీక్షించుకొని భవిష్యత్తులో విద్యార్థి సమస్యల మీద ఉద్యమాలు చేయటానికి ఈ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రకాశం జిల్లాలో ఉన్న ఆంధ్ర కేసరి యూనివర్సిటీకి 100కోట్లు నిధులు కేటాయించాలన్నారు. జిల్లాలో ఉన్న ట్రిపుల్ ఐటీ కి నిధులు కేటాయించాలన్నారు. జీవో నెంబర్ 77 రద్దు చేసి పీజీ విద్యార్థులకు స్కాలర్షిప్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాకు చెందిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి గారు సంక్షేమ హాస్టల్ సమస్యలు పరిష్కారం చేయాలన్నారు..

**నూతన కార్యవర్గం**

జిల్లా అధ్యక్షులుగా సిహెచ్.శ్యామ్, జిల్లా కార్యదర్శిగా జల్లి.వెంకటేష్, జిల్లా కోశాధికారిగా వి.కోటి తో పాటు 13 మంది తోటి నూతన కార్యవర్గం ఎన్నికయింది. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చొప్పర జాలన్న, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సీఎస్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 1న జిల్లా స్థాయిలో బాలబాలికల ఎస్‌జిఎఫ్ సెలక్షన్స్

(షణ్ముఖ వెలుగు,ఒంగోలు, సెప్టెంబర్ 28)

ప్రకాశం జిల్లా (ఉమ్మడి) పరిధిలోని అన్ని మేనేజ్మెంట్ల పాఠశాలలకు చెందిన బాల, బాలికల ఉమ్మడి జిల్లా స్థాయి యస్.జీ.యఫ్ సెలక్షన్స్ క్రింది తెలిపిన గేమ్స్ 01.10.2024 మంగళవారం నిర్వహించడం జరుగుతుందని జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి కె వనజ ఓ ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్ బాల్ – 14, 17 సంవత్సరముల బాల,బాలికలకు ఉదయం 9గంటలకు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఉమామహేశ్వరపురం ముండ్లమూరు మండలం నందు నిర్వహిం చనున్నారు. యోగా – 14, 17 సంవత్సరముల బాల,బాలికలకు మాత్రమే. ఉదయం 9గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేదరమెట్ల కొరిసపాడు మండలం నందు(నియోజకవర్గస్థాయిలో ఎంపికైన వారు మాత్రమే పాల్గొనాలి). రెజ్లింగ్ – 14, 17 సంవత్సరముల బాల,బాలికలకు ఉదయం 9 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గమల్లపాలెం కొత్తపట్నం మండలం నందు నిర్వహిస్తారు. టెన్నిస్ – 14, 17 సంవత్సరముల బాల, బాలికలకు ఉదయం 9 గంటలకు శాప్ టెన్నిస్ కోర్ట్, ఎం.ఆర్.ఓ ఆఫీస్ దగ్గర గిద్దలూరులో నిర్వహిస్తారు. కావున ఉమ్మడి జిల్లాల పరిధిలోని పీఈటీ, పీడీలు ఆసక్తి కలిగిన విద్యార్థులతో ఆన్లైన్ ఎంట్రీ చేసుకుని,మాన్యువల్ ఎంట్రీ ఫార్మ్‌తో వచ్చి సెలక్షన్స్‌లో పాల్గొనాలని కోరారు. 17 సంవత్సరముల కేటగిరీలో పాల్గొనే ఇంటర్మీడియట్ విద్యార్థులు పదో తరగతి మార్కుల లిస్టు, ఆధార్ కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడి నెంబరు, సంబంధిత ప్రిన్సిపల్ ధ్రువీకరణముతో నిర్వాహకులకు సమర్పించి పాల్గొనవచ్చున్నారు. సాఫ్ట్ బాల్ 9949564264, యోగా 9542655276, రెజ్లింగ్ 9849076920, టెన్నిస్ 9010040865ను సంప్రదించాలన్నారు.

# ఈవీఎం గోదాములను త్రైమాసిక తనిఖీ చేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియా





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా శనివారం స్థానిక మామిడిపాలెంలోని ఈ.వి.ఎం.గోదాములను సందర్శించారు. త్రైమాసిక తనిఖీలలో భాగంగా వివిధ రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాముల షట్టర్లు తెరిచి అందులోని ఈ.వి.ఎం.లను పరిశీలించారు. వాటి స్థితిగతులను ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంగణంలో కల్పిస్తున్న భద్రతపై ఆరా తీశారు. సంబంధిత రికార్డులను తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట రాజకీయ పార్టీల ప్రతినిధులు కాలేషా(టి.డి.పి.), జి.సత్యనారాయణ (బిజె.పి.), క్రాంతికుమార్ (వై.సి.పి.), రసూల్ (కాంగ్రెస్), జిల్లా ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, ఇతర అధికారులు ఉన్నారు. త్వరగా ఫ్రీ హోల్డింగ్ వెరిఫికేషన్ భూముల ఫ్రీ హోల్డింగ్ వెరిఫికేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా చెప్పారు. ఈ అంశంపై సి.సి.ఎల్.ఏ. జయలక్ష్మి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్రీ హోల్డింగ్ కు సంబంధించి జిల్లాలోని పరిస్థితిని వివరించారు. పరిశీలన కోసం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# పేద ప్రజలకు అన్ని విధాలుగా సహకారం అందిస్తాం

ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

లబ్ధిదారులకు మేలు చేకూర్చటమే ఎన్డీయే లక్ష్యం

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, సెప్టెంబర్ 28)



లబ్ధిదారులకు మేలు చేకూర్చటమే ఎన్డీయే లక్ష్యమని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు గృహనిర్మాణ శాఖ మరియు నగర పంచాయతీ కమిషనర్ ఆధ్వర్యంలో గిద్దలూరు పట్టణంలోని రాజానగర్‌లో నిర్వహించిన "మన ఇళ్ళు – మన గౌరవం" కార్యక్రమంలో భాగంగా రాజానగర్‌లో గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులతో నిర్వహించిన అవగాహన సదస్సులో గిద్దలూరు ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు వైసీపీ పాలనలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు తానే ఇళ్ళు కట్టిస్తానని చెప్పిన మాటను పక్కన పెట్టి కేవలం పేద ప్రజలకు లక్ష ఎనబై వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నరన్నారన్నారు. . తాను ఏర్పాటు చేసిన కాలనీల్లో కనీసం మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. నాడు తెలుగుదేశం హయాంలో పేద ప్రజల కోసం నిర్మించిన టిడ్కో గృహాలను జగన్ రెడ్డి పేద ప్రజల పై అక్కసుతో వాటిని లబ్ధిదారులకు అందకుండా నిలిపివేశారన్నారు. కానీ 2024 లో అధికారంలోకి వచ్చిన చంద్రన్న కూటమి ప్రభుత్వం లబ్దిదారుల గృహాల పై ఎటువంటి పక్షపాతం లేకుండా, గృహాలు నిర్మించుకున్న కాలనీల్లో మౌలిక వసతులు, త్రాగునీరు, రోడ్డు నిర్మాణాలు, విద్యుత్ దీపాలు వంటి వసతులను కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ లే అవుట్ లలో లబ్ధిదారులు తమ గృహ నిర్మాణాలను డిసెంబర్ నాటికీ పూర్తి చేసుకోవాలని, పేదలకు ఎన్డీయే ప్రభుత్వం అన్నీ విధాలుగా సహకారం అందిస్తుందన్నారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, స్థానిక కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్, నగర పంచాయతీ కమిషనర్ వెంకటదాసు, హౌసింగ్ ఈఈ శర్మ, డిఈ ఖదీర్ బాషా, ఎమ్మార్వో ఆంజనేయ రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి, కౌన్సిలర్లు బిల్లా రమేష్, పాలుగుళ్ల చిన్న శ్రీనివాసరెడ్డి, లోక్కు రమేష్, దేమా శ్రీరాములు, గడ్డం భాస్కర్ రెడ్డి, షేక్షావలి, దుత్తా బాలఈశ్వరయ్య, బొంతా లక్ష్మిదేవి, బీజేపీ నాయకులు పిడతల రమేష్ రెడ్డి , టీడీపీ నాయకులు సచివాలయ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అప్పుడు లేని డిక్లరేషన్..ఇప్పుడు ఎందుకు?

## వైసీపీ ఒంగోలు పార్లమెంటు పరిశీలకులు చెవిరెడ్డి భాస్కర రెడ్డి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

దివంగత ముఖ్యమంత్రి వై.యస్ రాజశేఖర్‌రెడ్డి ఐదుసార్లు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారని, ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ఐదు సార్లు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారని, అప్పుడు లేని డిక్లరేషన్ ఇప్పుడు ఎందుకు తీసుకొస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంటు పరిశీలకులు చెవిరెడ్డి భాస్కర రెడ్డి అన్నారు,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసత్య ఆరోపణలతో కలియుగ వైకుంఠమైన వెంకటేశ్వర స్వామి వారి ప్రతిష్టను అప్రతిష్ట పాలు చేస్తున్నారని మండిపడ్డారు, తిరుమల లడ్డుపై తెలుగుదేశం పార్టీ చేస్తున్న అసత్య ఆరోపణలను నిరసిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు దేవాలయాల్లో పూజా కార్యక్రమాల్లో భాగంగా ఒంగోలు సంతపేట సాయిబాబా మందిరంలోని వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఒంగోలు పార్లమెంటు పరిశీలకులు చెవిరెడ్డి భాస్కర రెడ్డి ,వైఎస్ఆర్సిపి శ్రేణులు పూజలు నిర్వహించారు. పూజల అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేని దాన్ని సృష్టించి ఒక అబద్ధపు ప్రచారాన్ని ప్రజల్లోకి చొప్పించి గందరగోలం అవడానికి తెరలేపారని విమర్శించారు. కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి విషయంలో రాజకీయాలు చేయటం కరెక్ట్ కాదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హెూదాలో పదుల సంఖ్యలో తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లి పూజలు చేసిన మళ్ళీ డిక్లరేషన్ ఇవ్వాలంటూ రాద్ధాంతం చెయ్యడం కరెక్ట్ కాదని అన్నారు. సరైన సమయంలో కలియుగదైవం తగిన శాస్తి చేస్తాడని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉన్నప్పుడు 40 వేల గుడులకు ధూప దీప నైవేద్యాలకు నెలనెలా నిధులు వెచ్చించాడని, వెంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. ఎన్నో దేవాలయాలతో పాటు జమ్మూ కాశ్మీరులో కూడా దేవాలయాలు నిర్మించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం విషయంలో రాజకీయాలకు తావు లేకుండా చూడాలని ఆయన అన్నారు. నగర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కటారి శంకర్, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చండూరు రవిబాబు,కే వీ రమణారెడ్డి, వెంకటేశ్వరశ్వర రెడ్డి , కేవీ ప్రసాద్, నరాల రమణారెడ్డి, కార్పొరేటర్ ఇమ్రాన్,ప్రవీణ్, వెన్నపూస శ్రీనివాసరెడ్డి, లంకపోతు అంజిరెడ్డి, బొట్ల రామారావు, బోట్లసుబ్బారావు, బడుగు ఇందిర, భూమి రెడ్డి రమణమ్మ, మట్టే రాఘవ, కుట్టుబోయిన కోటి, పల్నాటి రవీంద్రారెడ్డి, సూర్యరాజేష్, రాయపాటి అంకయ్య, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

# లడ్డు వివాదంపై పుంగనూరు నుంచి తిరుమల వరకు పాదయాత్ర

### భారత చైతన్య యువజనపార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 28)

పుంగనూరు నుండి తిరుమలకు పాదయాత్ర చేస్తున్న భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ గారికి మద్దతుగా ఉమ్మడి ప్రకాశం జిల్లా నుండి పార్టీ అభిమానులు పాల్గొనడం జరిగినది. లడ్డు తయారీలో కల్తీ జరిగిందని జరుగుతున్న ప్రచారంపై న్యాయ విచారణ జరిపించాలని పాదయాత్ర చేస్తున్న రామచంద్ర యాదవ్ గారికి మద్దతుగా అద్దంకి నుండి సామ్రాజ్యం గారు ఎర్రగొండపాలెం నుండి ఆత్మ రావు బత్తుల భూలక్ష్మి మార్కాపురం నుండి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేకించి 139 బీసీ కులాలు జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు మద్దతు ప్రకటించి పాదయాత్రలో పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు మాటలు ప్రక్షాలన చేయాలి



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, సెప్టెంబర్ 28)

తిరుమల లడ్డు ప్రసాదం పవిత్రతపై ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తుందంటూ సీఎం చంద్రబాబు మాటలు ప్రక్షాలన చేయాలని కోరుతూ యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు శనివారం పెద్దారవీడు మండలంలోని రాజంపల్లి గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామి ఆలయంలో వైసిపి నాయకులు పూజలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డు ప్రసాదం తయారు చేసే నెయ్యి లో పశువుల కొవ్వు కలిపారంటూ సీఎం చంద్రబాబు చేసిన వాక్యాలు దుర్మార్గమని ధ్వజమెత్తరు.జడ్పిటిసి చలమారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై కక్ష తీర్చుకోవడానికే చంద్రబాబు ఈ ఆరోపణలు చేస్తున్నారని ఆక్షేపించారు. సర్పంచి అంగురేకుల ఆదినారాయణ యాదవ్ మాట్లాడుతూ నుంచి ఎక్కడ ఏం జరిగినా దానికి గత ప్రభుత్వం వైఎస్ జగన్ కారణమంటూ నిందలు వేయటం సిగ్గుచేటని మండిపడ్డారు. మండల నాయకులు ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వంద రోజులు పాలనలో సంక్షేమ పథకాలు ఏమి చేయలేక, సూపర్ సిక్సులు గాలికి వదిలేసి తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు ప్రసాదం అడ్డం పెట్టుకొని అదేపనిగా తమను నిందిస్తున్నారని మండిపడ్డారు. ముందుగా తిరుమలనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి టెంకాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సేనా రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ దుద్యాల వెంకటరెడ్డి, సర్పంచులు ఏరువా వెంకటేశ్వర రెడ్డి, రామాజనేలు రెడ్డి, తోకల ఆవులయ్య, శివ కృష్ణారెడ్డి, వెంకట్ రెడ్డి, సుబ్బయ్య, నాయకులు కృష్ణారెడ్డి, రమణారెడ్డి కార్యకర్తలు అభిమానులు పూజలు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తవ్వకాలు పరిశీలించిన ఆర్డీవో

## - రైల్వే మార్జిన్, స్త్రైట్ కట్ కరకట్టలు - పరిశీలించిన రెవెన్యూ డ్రైనేజీ సిబ్బంది




(షణ్ముఖ వెలుగు, వేటపాలెం,సెప్టెంబర్ 28)

మండలంలోని పందిళ్లపల్లి, రామన్నపేట, వేటపాలెం పంచాయితీల పరిధిలో విజయవాడ-చెన్నై రైల్వే లైన్ హద్దులు, మార్జిన్స్ లలో అడ్డగోలుగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్న విషయమై ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ఫిర్యాదు చేసిన విషయమై శనివారం చీరాల ఆర్డీవో ఆధ్వర్యంలో వేటపాలెం తహసీల్దార్, వీఆర్వోలు, డ్రైనేజీ డిఇ డి సుబ్బారావు, డ్రైనేజీ ఏఈలు, రెవెన్యూ డ్రైనేజీ సిబ్బంది అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. రైల్వే మార్జిన్లు వెంబడి అసైన్డ్ , ఏ డబ్ల్యు ల్యాండ్స్ ఎవరెవరి పేరుతో రికార్డులలో నమోదైనది పరిశీలించి వారికి నోటీసులు జారీ చేయమని వేటపాలెం తహసీల్దారును ఆర్డీవో ఆదేశించారు. అక్రమ ఇసుక తవ్వకాల వలన వేటపాలెం రైల్వే బ్రిడ్జి ప్రక్కన స్త్రయిట్ కట్ కరకట్టపూర్తిగా నేలమట్టం ఆయన ప్రాంతాన్ని డ్రైనేజీ అధికారులతో కలిసి పరిశీలించిన ఆర్డిఓ, పోలీసు రెవెన్యూ రైల్వే డ్రైనేజీ అధికారులతో జాయింట్ ఆపరేషన్ చేయడం ద్వారా అక్రమ తవ్వకాలను అరికడతామని, బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు చేపడతామని ఆర్డిఓ తెలిపారు.

**పాతూరు వాళ్ళంటే భయం**

గత 30 సంవత్సరాలుగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని పందిళ్ళపల్లి పాతూరు వాళ్లు అంటే భయమని ట్రాక్టర్లు నేరుగా మనుషుల మీదకు ఎక్కించేస్తారని, మేమేమి చేయగలం సార్ అంటూ ఆర్డిఓ కి స్థానిక విఆర్ఓ తన పరిస్థితిని తెలియజేశారు. వేటపాలెం ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి గత దశాబ్దాలుగా జరుగుతున్న పరిస్థితి రెవిన్యూ డ్రైనేజీ అధికారులకు తెలుస్తున్నప్పటికీ నిస్సహాయక స్థితిలో ఉండటం వలన ప్రభుత్వ ఆస్తులు, ప్రకృతి వనరులు ఎలా ధ్వంసం అవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

**ఫిర్యాదుదారులపై వితండవాదం చేసిన డ్రైనేజీ బీఈ సుబ్బారావు**

వేటపాలెం స్త్రైట్ కట్టు కరకట్టల అక్రమ తవ్వకాల విషయమై డ్రైనేజీ డీఈ సుబ్బారావును ఫిర్యాదు దారుడు జర్నలిస్టు నాగార్జున రెడ్డి గత 30 సంవత్సరాలుగా కరకట్టలు ధ్వంసం జరుగుతుంటే డ్రైనేజీ శాఖ అధికారులు ఎందుకు బాధ్యత వహించలేదని ప్రశ్నించగా, మాకు సంబంధం లేదు పోలీసులు రెవిన్యూ వాళ్లే చూసుకోవాలి మాకు సిబ్బంది లేరు, మాకు సిబ్బందిని పోస్టింగ్ చేయించండి, మాకు బాధ్యత లేదు స్థానికులు మీరే కాపాడుకోవాలి అంటూ వితండవాదం చేయటం అధికారులను విస్మయానికి గురి చేసింది. ఇన్ని సంవత్సరాలుగా కరకట్టల తవ్వుతున్న వారిని డ్రైనేజీ అధికారులు ఎందుకు గుర్తించలేకపోయారని, ఇప్పటివరకు పోలీస్ స్టేషన్లలో ఇచ్చిన ఫిర్యాదులు మీద ఎంతవరకు చర్యలు జరిగే విధంగా డ్రైనేజీ శాఖ బాధ్యత వహించిందని నిలతీయగా, కరకట్టలు కాపాడే బాధ్యత మాది కాదంటూ డి ఈ సుబ్బారావు ఫిర్యాదుదారులపై వాగ్వాదానికి దిగటం డ్రైనేజీ శాఖ పనితీరును స్పష్టం చేస్తున్నది.

# దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించే పాఠశాలలపై విద్యాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి

### ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తడుకు చందు



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇన్‌చార్జి, సెప్టెంబర్ 28)

నాయుడుపేట కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తడుకు చందు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలకు ప్రకటించిన దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించే పాఠశాల పై విద్యాశాఖ అధికారులు ఘటన చర్యలు తీసుకోవాలని అఖిల భారతీ విద్యార్థి సంఘం నాయకులు తడుకు చందు డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అనేక కార్పొరేట్ పాఠశాలలో సెలవు రోజుల్లో తరగతులను నిర్వహిస్తున్నాయన్నారు. అలాంటి పాఠశాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం అక్టోబర్ 3 నుంచి అక్టోబర్ 13వ తేదీ వరకు విద్యార్థులకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది అన్నారు. అయితే కార్పొరేట్ మరియు ప్రైవేట్ పాఠశాలలు ప్రత్యేకత తరగతులు పేరిట విద్యార్థులను పాఠశాలకు పిలిచి తరగతులు నిర్వహిస్తున్నాయన్నారు అలా తరగతులు నిర్వహించి పాఠశాలను వెంటనే తనిఖీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు భర్తీ కోసం దాతలను తీసుకొని రానవసరం లేదు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కొత్త కూరగాయల మార్కెట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంకు పని తీరును పాత్రికేయులకు వివరించారు. ముందుగా రెడ్ క్రాస్ చైర్మన్ ప్రకాష్ బాబు మాట్లాడుతూ విపత్కర పరిస్థితులలో రెడ్ క్రాస్ ముందుండి సేవలందిస్తుందని ఇటీవల విజయవాడ వరదలలో కూడా రెడ్ క్రాస్ అందరికంటే ముందుండి సేవలందించిందని తెలియచేసారు. ఒంగోలు లో రెడ్ క్రాస్ ఆధునీకరించి రక్త విభాగాలను అందించే మూడు కోట్ల రూపాయల విలువైన పరికరాలను జాతీయ రెడ్ క్రాస్ సహాయంతో సమకూర్చుకొన్నామని తెలియచేసారు. బ్లడ్ బ్యాంకు కన్వీనర్ మంగళగిరి నరసింహారావు మాట్లాడుతూ కరోనా సమయంలో రాష్టంలో బ్లడ్ బ్యాంకు లు మూతపడగా రక్త నిలువలు సమకూర్చుకొని నిరాఘాటంగా సేవలందించామని తెలిపారు. అత్యవసర వేళలలో రక్త నిలువలకోసం దాతలను తీసుకొని రానవసరం లేదని దాతల కోసం ఆందోళన పడకుండా రక్తాన్ని అవసరమైన రోగులకు ఇవ్వగమని తెలియచేసారు. సీనియర్ కోఆర్డినేటర్ రామకృష్ణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఇతర విపత్కర సంఘటనలు ముందుగా తెలిసేది పాత్రికేయులకని వారికి రక్తం అవసమైతే వెంటనే రెడ్ క్రాస్ కు తెలియచేయాలని రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డా వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో రెడ్ క్రాస్ గౌరవ వైద్యాధికారి చెరుకూరి రవి, డాక్టర్ కృష్ణ, డాక్టర్ సుబ్బారావు, ఐఎంఏ పూర్వాధ్యక్షులు డాక్టర్ మణిబాబు, మేనేజింగ్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




# క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత శిఖరాల అధిరోహించవచ్చు

### ఇంచార్జి మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి డి అమ్మన రాజా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

చిన్నతనం నుండే విలువలతో కూడిన విద్య క్రమశిక్షణ వలన జీవితంలో ఉన్నత శిఖరాల అధిరోహించవచ్చని ఇంచార్జి మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి , ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి డి అమ్మన రాజా అన్నారు. ఈరోజు శనివారం ఒంగోలు పట్టణంలోని బాల సదన్ సందర్శించిన న్యాయమూర్తి అక్కడ విద్యార్థులకు అందుతున్న వసతి సదుపాయాలు, భోజన సదుపాయాలను పరిశీలించారు. సంబంధిత దస్త్రాలు, కార్యాలయ నిర్వహణ పరిశీలించారు మరింత మెరుగైన సదుపాయాల కోసం, వసతుల కోసం మెరుగైన సూచనలు అందించారు. చట్టపరంగా విద్యార్థులకు అవసరమైన న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తుందని తెలిపారు. మానసిక వైద్యుల అవసరం ఉన్న పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిల్లల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దినేష్, శేఖర్, రత్నరాజు, కార్యాలయ సూపరింటెండెంట్ జీవిత పాల్గొన్నారు.

# దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా జాషువా జయంతి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో స్వర్గీయ గుర్రం జాషువా జయంతి ఘనంగా నిర్వహించబడింది. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డి.అనంత లక్ష్మి అధ్యక్షత వహించగా, ఐక్యూఏసీ సంచాలకులు పి.కుసుమ కుమారి, ఆంగ్ల ఉపన్యాసకులు ఏవీ రాజ్యలక్ష్మి, ఆంగ్ల శాఖాధిపతి ఎం.సుధారాణి విద్యార్థులు ఉద్దేశించి ప్రసంగించారు. తెలుగు శాఖ అధ్యక్షులు పి.యామిని అమ్మాజీ గుర్రం జాషువా జీవిత, సాహితీ విశేషాలను కూలంకషంగా వివరించారు. అనంతరం విద్యార్థులకు జాషువా జీవిత చరిత్రకు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో పోటీ నిర్వహించబడింది. దీనికి న్యాయ నిర్ణేతలుగా కంప్యూటర్ అధ్యాపకులైన యు.సరళ, వై.సుష్మ , వ్యవహరించారు. విద్యార్థులు (తమ సిలబస్ లో గల) జాషువాచే రచింపబడిన గబ్బిలం కావ్యంలోని పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. స్వర్గీయ జాషువాకి నివాళు లర్పించడంతో ఈ కార్యక్రమం ముగిసింది.

## అన్న క్యాంటీన్‌కు టీడీపీ నేతలు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ద్వారా విరాళం



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, సెప్టెంబర్ 28)

తెలుగుదేశం పార్టీ గిద్దలూరు కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తముల అశోక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అన్న కాంటీన్ విరాళం అందజేశారు . బెస్తవారిపేట మండలం, గలిజేరుగుళ్ళ గ్రామ సర్పంచ్ చింతా దేవభూషణం, గురువయ్య, కొండా కాశిరెడ్డిలు రూ.10,000, కంభం పట్టణానికి చెందిన ఎన్నారై టిడిపి సభ్యులు సయ్యద్ రఫీ, దీనావలి, మహబూబ్ బాషా, ఉస్మాన్ భేగ్‌లు రూ.20,000లను చెక్కు ద్వారా ఎమ్మెల్యేకి అందజేశారు. ఈ సందర్భంగా వారందరిని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో బెస్తవారిపేట మండల అధ్యక్షులు సొరెడ్డి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## జిల్లా గ్రంధాలయంలో గుర్రం జాషువా, భగత్ సింగ్‌లకు ఘన నివాళి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

జిల్లా కేంద్ర గ్రంథాలయం ఒంగోలు నందు శనివారం నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ కవి కోకిల, కళా ప్రపూర్ణ, కవితా విశారద, కవి దిగ్గజ%శీ% గుర్రంజాషువా 129వ జయంతి , మనుషులను చంపగలరు వారి ఆదర్శాలను కాదని అన్ని దిక్కులు పిక్కటిల్లేలా గర్జించిన భగత్ సింగ్ 117వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించటం జరిగింది. ముందుగా గుర్రం జాషువా మరియు భగత్ సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి స్మృతికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీమతి కాసు ఆదిలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడుతూ జాషువా సాహిత్యం ద్వారా, భగత్ సింగ్ లు అసమానతలను తొలగించే ప్రయత్నం చేశారని, ఇద్దరూ సమతా, మమతల,మానవతా వాదులని కొనియాడారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు ప్రసంగిస్తూ జాషువా ఆధునికాంధ్ర సాహిత్య రంగంలో తొలితరం కవుల్లో అగ్రగణ్యులని ,సమ సమాజం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయమూర్తియని ,ఆంధ్ర సాహితీ ప్రియుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని ప్రశంసించారు. తదనంతరం జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉపగ్రంథ పాలకురాలు శ్రీమతి బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ అంటరానితనంతో అవమానాలను ఎదుర్కొన్న జాషువా హృదయం సంఘసంస్కరణ దృక్పథాన్ని కోరుకున్నదని, సాంఘిక విప్లవం రావాలని, సంఘంలో దురాచారాలు సమసిపోయి అందరూ సహజీవనం చేయాలని ఆశించారని కోరుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## తెలుగు సాహిత లోకంలో గుర్రం జాషువా దిగ్గజ వ్యక్తి

### జిల్లా మాదిగ జర్నలిస్టు ఫోరమ్ అధ్యక్షులు గురిజాల బాబురావు మాదిగ



(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, సెప్టెంబర్ 28)

గుర్రం జాషువా ఒక తెలుగు కవి, తెలుగు సాహిత లోకంలో ఆయన దిగ్గజ వ్యక్తి అని ప్రకాశం జిల్లా మాదిగ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షులు గురిజాల బాబురావు మాదిగ కొనియాడారు. శనివారం మండల కేంద్రమైన మద్రిపూడి ఎస్సీ కాలనీ పాఠశాల ఆవరణలో జరిగిన గుర్రం జాషువా 129వ జయంతి సభకు మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు మోయిడీ బసవయ్య మాదిగ అధ్యక్షత వహించారు, ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బాబురావు మాదిగ మాట్లాడుతూ జాషువా తన కవిత్వాన్ని విశ్వవ్యాప్త విధానంతో రాశారన్నారు,కొండపి నియోజకవర్గం మాదిగ ఉద్యోగుల సంఘం కన్వీనర్ బీడీ కిషోర్ మాదిగ మాట్లాడుతూ తన అపారమైన జ్ఞానంతో, కుల ఆధారిత వివక్ష కారణంగా ఆయన ఎదుర్కొన్న పోరాటం ద్వారా కవిత్వం రాశారన్నారు,మోయిడి లూకయ్య మాట్లాడుతూ జాషువా సెప్టెంబర్ 28, 1895 లో పల్నాడు జిల్లా వినుకొండ లో జన్మించారని జూలై 24,1971 వ సంవత్సరంలో మరణించారని వివరించారు, ఈకార్యక్రమంలో గురిజాల రాజేష్, గురుజాల కాటయ్య, కొండ్రు అనోక్, కొండ్రు జాన్, గండి రత్తయ్య,కొమ్ము ఇస్సాకు, కొండ్రు ప్రేమ్ కుమార్, గురిజాల ప్రేమయ్య,గురజాల పెద్దయ్య,గురుజాల జల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ఎస్సీ ఎస్టీ భూముల్ని ఆక్రమించినా కేసులూ లేవు, అరెస్టులూ లేవు



## రిలీఫ్ ఇవ్వకుండా ఎస్సీ ఎస్టీలను వేధిస్తున్నారు

### ఎస్టీ కమిషన్‌ను కలిసిన దళిత నేత నీలం నాగేంద్ర

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

ప్రకాశం జిల్లాలో ఎస్సీ ఎస్టీ యాక్టు అమలులో వివక్షను అడ్డుకోవాలని నేషనల్ ఎస్టీ కమిషన్ మెంబర్ జాతోతు హుస్సేన్ నాయక్ ను దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు కోరారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా శనివారం ఒంగోలు వచ్చిన కమీషన్ మెంబర్ను నాగేంద్ర కలెక్టర్ కార్యాలయంలో కలిశారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీలు సాగు చేసుకుంటున్న భూములను ఆక్రమించుకున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేయడం లేదని, రెవెన్యూ అధికారులు ఎస్సీ ఎస్టీల భూమి హక్కులను గుర్తించడం లేదన్నారు. ఎస్సీ ఎస్టీ యాక్టు కేసుల్లో రిలీఫ్ మంజూరులో కొర్రీల మీద కొర్రీలు వేస్తూ, కలెక్టరేట్ అధికారులు బాధిత ఎస్సీ ఎస్టీలను వేధిస్తున్నారన్నారు. తాళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చింతలపాలెం గ్రామంలో ఎస్టీలను భూమి నుంచి వెళ్లగొట్టేందుకు జరిగిన దాడిపై నమోదైన ఎస్సీ ఎస్టీ కేసు క్రైమ్ నెంబర్ 155/21లో, బాధితులకు రిలీఫ్ ఇవ్వకుండా మూడు సంవత్సరాలుగా కలెక్టరేట్ అధికారులు వేధిస్తున్నారన్నారు. ఎస్సీ ఎస్టీ కేసు విచారణ అధికారి డిఎస్పి అని, డీఎస్పీ బాధితుల లిస్టును ఎస్పీ కార్యాలయం ద్వారా కలెక్టరేట్కు పంపిస్తే, కలెక్టరేట్ అధికారులు డీఎస్పీ రిపోర్టును పరిశీలించాలని ఎస్పికి లేఖ రాశారన్నారు. కలెక్టరేట్ అధికారుల చర్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఎస్పి తహసిల్దార్ రిపోర్ట్ పంపిస్తే, మరల ఆర్డీఓ నుంచి రిపోర్ట్ రావాలని కొర్రి వేశారన్నారు. 7 రోజుల్లో ఇవ్వాల్సిన రిలీఫ్ 3 సంవత్సరాలైనా ఇవ్వటం లేదన్నారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో 41ఎ సిఆర్పిసి నోటీస్ పేరుతో స్టేషన్ బెయిల్ ఇచ్చి నిందితులను ఇళ్లకు పంపుతున్నారన్నారు. 2022లో చీమకుర్తిలో హత్యకు గురైన దేవరకొండ రత్తమ్మ కేసులో కుటుంబ సభ్యులకు ఎస్సీ ఎస్టీ మంత్లీ పెన్షన్, అవుట్ సైట్స్, వ్యవసాయ భూమి, ఉద్యోగం ఇంకా మంజూరు చేయలేదన్నారు. గిద్దలూరు పట్టణం అర్బన్ కాలనీలో మాజీ సైనికుడైన సుగాలి కులస్తుడు మూడవత్ కాశ నాయక్ పై సెప్టెంబర్ 27న జరిగిన దాడి ఘటనకు సంబంధించి ప్రభుత్వ హాస్పిటల్ ట్రీట్మెంట్ రికార్డులు, సీసీ కెమెరా సాక్షాలు, సీసీ కెమెరాలో రికార్డు అయిన ఆడియో సాక్షాలు ఉన్నప్పటికీ ఘటన జరిగి నెల రోజులు గడుస్తున్న ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. తాళ్లూరు మండలం చింతలపాలెం, గిద్దలూరు పట్టణంలో ఎస్టి కులస్తులు పై జరిగిన దాడి ఘటనలపై కేసు నమోదు చేయకపోవాటాన్ని బట్టి జిల్లాలో ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయకూడదని పోలీసులు భావిస్తున్నట్టుగా అనుమానించాల్సి వస్తుందని నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగేంద్ర వెంట మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, దళిత నాయకులు కాకుమాను రవి, మక్కెన వర కుమార్, కసుకుర్తి రాజు తదితరులు ఉన్నారు.

## ఫుడ్ స్ట్రీట్‌ను ప్రారంభించిన మేయర్ గంగాడ సుజాత





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుచున్న స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం 36వ డివిజన్లో గల రంగారాయుడు చెరువు దగ్గర నగరపాలక సంస్థ వారు ఏర్పాటు చేసిన ఫుడ్ స్ట్రీట్‌ను మేయర్ గంగాడ సునీత రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతినిత్యం రద్దీ గా ఉండే ఈ ప్రాంతంలో చిరు తిండి వ్యాపారులు వారి యొక్క బండ్ల పైన వ్యాపారాలు చేసుకుంటూ ఉండటం వల్ల, వీటివల్ల నగర ప్రజలు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతూ ఉండటం వల్ల వీరందరినీ కూడా దీనిని రోడ్డుకి ఒకవైపున అక్కడ వ్యాపారం జరుపుకుంటున్న అందరూ చిరు తిండి వ్యాపారస్తులను ఒకే వరుస క్రమంలో ఏర్పాటు చేస్తూ ఫుడ్ స్ట్రీట్ ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనివల్ల వచ్చే వ్యర్థములు అన్ని కూడా ఒకే చోట చేర్చడం ద్వారా పారిశుద్ధ కార్మికులకు పని కొంచెం సులువు అవుతున్నదని తెలిపారు. ఈ రోజు ప్రారంభించిన ఫుడ్స్ స్ట్రీట్లో సుమారు 31 మందికి మార్కింగ్ చేసి వారి వ్యాపారాలు చేసుకొనుటకు స్థలములను కేటాయించడం జరిగినది అని తెలిపారు. ఇదే విధముగా నగరంలో మరికొన్ని చోట్ల ఖాళీ స్థలములను గుర్తించి నగర ప్రజలకు ట్రాఫిక్ అవాంతరాలు కలగకుండా ఉండేటట్లు త్వరలోనే ఇంకొన్ని ఫుడ్ స్ట్రీట్ లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీటి కొరకు చిరుతిండి వ్యాపారస్తులందరూ కూడా నగరపాలక సంస్థకు సహకరించవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గారితో పాటు నగరపాలక సంస్థ మేయర్ డిప్యూటీ మేయర్ ఇతర కార్పొరేటర్లు 36వ డివిజన్ టిడిపి అధ్యక్షులు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక సిబ్బంది సానిటరీ విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా అధ్యక్షుడు కాకాణిని కలిసిన మాజీ ఎంపీ ఆదాల



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, సెప్టెంబర్ 28)

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా నియమితులైన మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిగారిని శనివారం సాయంత్రం నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి కలసి అభినందించారు. ఈ మేరకు ఆయన నెల్లూరు నగరంలోని డైకాస్ రోడ్ సమీపంలోని మాజీ మంత్రి కాకాని నివాసంకు చేరుకొని అభినందనలు తెలియజేశారు. అనంతరం ఇరువురి అగ్రనాయకులు, జిల్లా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జడ్పిటిసి సభ్యులు మల్లు సుధాకర్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్ణ వెంకయ్య, పేర్నాటి కోటేశ్వర్ రెడ్డి, సిహెచ్ హరిబాబు యాదవ్, జిల్లా వైసీపీ యూత్ అధ్యక్షులు మంగళ్లపూడి శ్రీకాంత్ రెడ్డి, షేక్ హంషీద్ అలీ, సయ్యద్ అలీం, షేక్ అల్లాబక్షు, ఇక్బాల్ బాయ్, యం శ్రీధర్ బాబు, జాకీర్, కొండేటి నరసింహారావు, ముత్తంగి రామయ్య, కల్లూరు లక్ష్మీరెడ్డి, బెల్లంకొండ వెంకయ్య, ఆదిత్య, షాజీద్, తదితరులు ఉన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలు చేసిన వైసిపి నాయకులు





(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, సెప్టెంబర్ 28)

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ చూడని రాక్షస రాజ్యం నడుస్తోంది. దేవుడి దగ్గరకు వెళ్లే కార్యక్రమాన్ని కూడా అడ్డుకునే మనస్తత్వం ఉన్న వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండడం రాష్ట్ర ప్రజలు యొక్క దురదృష్టం. తిరుమల తిరుపతి లడ్డు ప్రసాద విషయంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేయాలని కోరుతూ పెద్ద దోర్నాలలోని శ్రీ లక్ష్మి నరసింహాస్వామి ఆలయంలో శనివారం వైసీపీ నాయకులు పూజ కార్యక్రమం నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాలతో దోర్నాల మండల కన్వీనర్ ఘంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వైసీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల వైసీపీ కన్వీనర్ ఘంటా వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ తిరుమల తిరుపతి పవిత్రత,స్వామివారి ప్రసాదం విశిష్టతను, తిరుమల దేవస్థానం పేరు ప్రఖ్యాతలను రాజకీయ దుర్బుద్ధితో, జంతువుల కొవ్వుతో లడ్డూలు తయారైనట్టుగా, ఒక జరగని విషయాన్ని జరిగినట్లుగా ఆకల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్లుగ సీఎం స్థానంలో ఉన్న నారా చంద్రబాబు నాయుడు తెలిసి తెలిసి అబద్దాలు ఆడుతూ, అసత్యాలు పలుకుతూ స్వామి వారి పేరు ప్రఖ్యాతలను, తిరుపతి లడ్డూ విశిష్టతను దగ్గరుండి అపవిత్రం చేసే దుష్టపన్నాగానికి పూనుకున్నాడు అని అన్నారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం దగ్గర అన్నదాన కార్యక్రమమును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మాజీ ఎంపీపీ జోగి వెంకటనారాయణ, గుమ్మ యల్లేష్, ఒంటేరు నాగేశ్వరావు, చంద్రకాంత్ నాయక్, వల్లభనేని పవన్ కుమార్, మాజీ సర్పంచ్ యాక్కంటి లింగారెడ్డి, చిట్యాల శ్రీనివాసరెడ్డి, అల్లు రాంభూపాల్ రెడ్డి, లాలూ నాయక్, వెన్నా వెంకటేశ్వర రెడ్డి,రావిక్రింది రామారావు, మండ్ల వెంకట రమణ, వైసిపి కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు శాలివాహనుల నూతన కమిటీ ఎన్నిక

### సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ప్రతి ఒక్కరు హాజరుకావాలని నాయకుల పిలుపు



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, సెప్టెంబర్ 28)

నేడు పట్టణంలోని శాలివాహనుల సంక్షేమ భవనం నందు నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుంది అని ఆ నాయకులు పేర్కొన్నారు. గతంలో శాలివాహనుల అభ్యర్థి మేరకు ప్రభుత్వం ఒక ఎకరా స్థలం ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. ఆ స్థలము లో దాతల సహకారంతో భవన నిర్మాణం చేయడం జరిగిందన్నారు. అది ఆశించిన మేర అభివృద్ధి జరగలేదన్నారు. దానికోసం ఆదివారం జిల్లాలోని శాలివాహన కులస్తులందరికీ సలహాలు, సూచనలు ఇవ్వాలని పిలుపునివ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు పాల్గొని తమకు సహకరించి తగు సూచనలు ఇవ్వాల్సిందిగా వారు అభ్యర్థించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుంది అని వారు తెలిపారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని వారి విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా విశ్వనరుడు గుర్రం జాషువా జయంతి సభ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

స్థానిక ఒంగోలులోని సి.వి.యన్ రీడింగ్ రూం పైఆవరణలో 28వ తేదీ శనివారం "శ్రీ నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్" వారి ఆధ్వర్యంలో నవయుగ కవి చక్రవర్తి,విశ్వకవి, కవికోకిల గుర్రం జాషువా 129వ జయంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సంస్థ అధ్యక్షులు మిడసల మల్లికార్జునరావు నిర్వహణలో కార్యదర్శి కనమాల రాఘవులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ గుర్రం జాషువా తెలుగు సాహితీ పూతోటలో విర బూసిన సాహితీ సుగంధ పుష్పమని, ఆయన పేరు వింటేనే మల్లెలు సుగంధ పరిమళాల్ని వెదజల్లుతాయని, ఆయన కవిత్వమే ఆయుధంగా మూఢాచారాలపై తిరగబడ్డ మహాకవియని పేర్కొన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ సంఘ సంస్కరణే ఆయన కావ్య లక్షణాలని,లివర్గ సంఘర్షణ, ఆర్థిక ఉద్దేశాలు, దోపిడి వర్గాల పై తిరుగుబాటు చేసిన అభ్యుదయవాదియని ప్రశంసించారు. కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు ప్రసంగిస్తూ జాషువా తన జీవితాన్ని శాశ్వత సత్యాలను, మానవత్వాన్ని చెప్పే దిశగా నడిపించిన వ్యక్తని , ఆయన కు జీవితం ఎన్నో పాఠాలు నేర్పిందని ఆయనకు ఇద్దరు గురువులు ఉన్నారని ఒకరు పేదరికం మరొకరు కుల మత భేదం అని చెప్పే వారని తెలిపారు. డాక్టర్ పరాకుంశం కేశవా చార్యులు మాట్లాడుతూ వడగాల్పు నా జీవితమైతే వెన్నెల నా కవిత్వం అంటూ చీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందారని ఉటంకించారు. శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు జాషువా గురించి వివరిస్తూలిఆవేదనాభరితమైన హృదయంతో పద్యమై, పద్యార్థమై గర్జించి తన దళిత ధిక్కార స్వర ప్రభంజనాన్ని వినిపించారని తెలిపారు.ఈకార్యక్రమంలో రాయపాటి ఆశీర్వాదం,కరవైంది సుబ్బారావు, ఆపరేటర్ వెంకటేశ్వర్లు, గుంటూరు సత్యనారాయణ, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు,నూకతోటి శరత్ బాబు, మిట్నసల శాంతారావు,ఐ.నరసింహారావు,కోప్పోలు వెంకటేశ్వర్లు,అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత హీ సేవ పై విద్యార్థులతో మానవహారం







(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టెంబర్ 28)

స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం కమిషనర్ డానియేల్ జోసఫ్ ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు స్వచ్ఛతపై మానవహారంతో పాటు, తడి చెత్త,పొడి చెత్త సేకరణ పై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కనిగిరి మునిసిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్,శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా స్వచ్ఛత లో భాగస్వాములు కావాలని మరియు మీ కుటుంబ సభ్యులతో కలిసి మన ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకుంటే అనారోగ్యాల భారిన పడకుండా రక్షించుకోవచ్చు అన్నారు. తడి చెత్త మరియు పొడి చెత్త పై మీ తల్లి దండ్రులకి అవగాహన తీసుకురావాలని, పాఠశాల ఆవరణంలో చెత్త వేయకుండా డస్ట్ బిన్ డబ్బాలో వెయ్యాలని తగు సూచనలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో పిసిపల్లి మండలం విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవ్,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, శానిటరీ సెక్రెటరీలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## కదులూరు పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జి, సెప్టెంబర్ 28)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఇది మంచి ప్రభుత్వం అనే నినాదంతో తిరుపతి జిల్లా తడ మండలం కాదులూరు పంచాయతీ నందు శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వ అడ్డగోలు పరిపాలనలో రాష్ట్ర సంక్షోభంలోకి వెళ్లిందని సంక్షోభంలోనూ సంక్షేమం అందించి అభివృద్ధికి రెక్కలు తొడిగి మొదటి వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల చేత అనిపించుకుంటుందని, సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రతి సమస్యని పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తామని తెలియజేసారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ప్రతి సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తున్నమని, సూపర్ 6 పథకాలతో రాష్ట్ర ముందుకు వెళుతున్నాను తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు సుదర్శన రావు మాట్లాడుతూ కాదులూరు మాజీ సర్పంచ్ తెలుగుదేశం పార్టీ నాయకులు వేలూరు చంద్రయ్య కాదులూరు పంచాయతీ అభివృద్ధికై ఎల్లవేళలా కృషి చేస్తున్నారని, పంచాయతీలో సిసి రోడ్లు సిసి డ్రైన్స్, స్మశానం కు దారి మొదలగు అన్ని పనులు చంద్రయ్య పట్టుదలతో కాదులూరు పంచాయతీలో చేశారని తెలిపారు. పై కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి, తడ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో గతంలో ఎన్నడూ చూడని రాక్షస రాజ్యం

### యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్ఛార్జి, సెప్టెంబర్ 28)



రాష్ట్రంలో గతంలో ఎన్నడూ చూడని రాక్షస రాజ్యం నడుస్తోంది. దేవుడి దగ్గరకు వెళ్లే కార్యక్రమాన్ని కూడా అడ్డుకునే మనస్తత్వం ఉన్న వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండడం రాష్ట్ర ప్రజలు యొక్క దురదృష్టమని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. తిరుమల పవిత్రత, స్వామివారి ప్రసాదం విశిష్టతను, తిరుమల తిరుపతి దేవస్థానం పేరు ప్రఖ్యాతలను రాజకీయ దుర్బుద్ధితో, జంతువుల కొవ్వుతో లడ్డూలు తయారైనట్టుగా, ఒక జరగని విషయాన్ని జరిగినట్లుగా.. ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్లుగా.. సీఎం స్థానంలో ఉన్న చంద్రబాబు నాయుడు తెలిసి తెలిసి అబద్దాలు ఆడుతూ, అసత్యాలు పలుకుతూ.. స్వామి వారి పేరు ప్రఖ్యాతలను, తిరుపతి లడ్డూ విశిష్టతను దగ్గరుండి అపవిత్రం చేసే దుష్టపన్నాగానికి పూనుకున్నాడు. సాక్షాత్తూ ఒక ముఖ్యమంత్రి మత కల్లోలాలు జరగాలని కుట్రలు చేస్తుంటే రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలు ఏ విధంగా ఇబ్బందులు పడతారు అని భయమేస్తుంది. చంద్రబాబు చేసిన ఈ ఘోర పాపానికి శిక్ష, ప్రజలకు కలగకూడదని కోరుకుంటూ, తప్పు చేసింది ప్రజలు కాదు, స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గారేనని కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామికి తెలియజేయాలనేటువంటి సంకల్పంతో వైయస్ జగన్ ఆదేశాల మేరకు తిరుమలలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం జరిగింది. ఘోర అపచారం చేసి, వెంకటేశ్వరస్వామిని పలచన చేస్తూ, ఆయన ప్రసాదాన్ని లోకువ చేస్తూ.. పచ్చి అబద్దాలు ఆడుతూ, క్షుద్ర వాక్యాలు చేసిన చంద్రబాబుకి మంచి బుద్ధి ప్రసాదించాలని వెంకటేశ్వర స్వామి వారిని మనసారా కోరుకున్నానని తాటిపర్తి తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 28)

మండల కేంద్రమైన ఉలవపాడు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రియంవద ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా గర్భిణీ స్త్రీలకు సంబంధించిన స్కానింగ్ సెంటర్ ను పలు రికార్డులను పరిశీలించడం జరిగింది. గర్భిణీ స్త్రీలకు సంబంధించిన గైనకాలజిస్ట్ డాక్టర్ 6 నెలలు సెలవులో ఉండడంతో హాస్పిటల్ కి వచ్చే గర్భిణీ స్త్రీలు చెకప్ కు స్కానింగ్ లకు ఎంతో ఇబ్బంది పడుతున్నారని మెడికల్ ఆఫీసర్ మేడంకి వివరించారు. హాస్పిటల్ కి వచ్చిన గర్భిణీలు ఈ హాస్పిటల్లో మాకు గైనకాలజిస్ట్ డాక్టర్ లేక ఎంతో ఇబ్బంది పడుతున్నామని ఉన్నతాధికారులు మా మనవి ఆలకించి డాక్టర్ ని ఏర్పాటు చేయవలసిందిగా పేషెంట్లు కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.హరీష్, ఇతర వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## త్వరలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో ట్రైనింగ్ కార్యక్రమాలు

### కమీషనర్ కె వెంకటేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

ఒంగోలు నగరంలో గల 50 వ డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్, నేతాజీ నగర్ , వెంకటేశ్వర కాలనీలలో కమీషనర్ కె. వెంకటేశ్వరరావు ఈ రోజు పర్యటించారు. ఈ పర్యటనలో తొలుత నెహ్రూ నగర్ లో పార్క్ పక్కన రోడ్ లో రోడ్ మీదుగా నిర్మించిన దేవాలయం , షెడ్డుని వెంటనే తీసివేయాలని పట్టణ ప్రణాళిక విభాగపు సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. అలానే నెహ్రూ నగర్ లో గల పార్క్ ని పరిశీలించి, పార్క్ యొక్క అభివ్రిద్ది పనులను గురించి ఏఈ గారిని వివరాలు అడిగి తెలుసుకొని పెండింగ్ లో ఉన్న వాకింగ్ ట్రాక్ పనులు మరియు పిల్లల ఆటవస్తువల రిపేర్ తదితర పనులను వెంటనే పూర్తి చూపించే విధముగా చర్యలు తీసుకోవాలి అని సూచించారు. అలానే నెహ్రూ నగర్లోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ని కమీషనర్ కె.వెంకటేశ్వరరావు సందర్శించి త్వరలో మళ్ళీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆ తరువాత కమీషనర్ ఈ నెల 23వ తేదీన మీకోసం కార్యక్రమంలో వచ్చిన అర్జీ కి సంబవధించిన పట్టా ఆక్రమణ స్టలామును చూసి , పట్టం ప్రణాళిక సిబ్బందికి సూచనలు చేసారు. ఆ తరువాత నేతాజీ కాలనీ లో పర్యటించి, అక్కడ ఉన్న ఇండ్లకు ఇంటి పన్ను వేయవల్సినిదిగా సంబంధిత రెవిన్యూ ఇన్స్పెక్టర్ ని ఆదేశించారు. తరువాత వెంకటేశ్వర కాలనీ లో మురుగు కాలువను దాటి రోడ్ ఆక్రమించి చేపడుతున్న ఇంటి నిర్మాణంను పరిసలించి, ఆక్రమించిన మేరకు వెంటనే నిర్మాణమును తొలగించాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. ఆ తర్వాత బైపాస్ రోడ్ లో బైక్ షో రూమ్ ఎదురుగా వున్న కాలువలో నీటి పారుదల లేకుండా ఉండటం గమనించి సానిటరీ ఇన్స్పెక్టర్స్కి వెంటనే నీరు నిల్వ ఉండకుండా చేసేలా చర్యలు తీసుకోవాలి అని తెలిపారు. కమీషనర్ , స్వచ్ఛ హి సేవ కార్యక్రమంలో భాగంగా నగరం లోని రంగరాయుడు చెరువు వద్ద ఏర్పాటు చేస్తున్న ఫుడ్ స్ట్రీట్ ని పరిసలించి నగర పాలక సిబ్బందికి తగు సూచనలు చేసారు. ఈ రోజు కార్యక్రమం లో ఒంగోలు నగర పాలక సంస్థ కమీషనర్తో పాటు, 50వ డివిజన్ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ , సానిటరీ సూపెర్వైజర్ ,శానిటరీ ఇన్స్పెక్టర్లు, నెహ్రూ నగరు ,వెంకటేశ్వర కాలనీ సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## ఆకుకూరలు, చిరుధాన్యాలతో ఆరోగ్యం



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, సెప్టెంబర్ 28)

దోర్నాల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెద్దారవీడు మండల పరిధిలోని పెద్దారవీడు , సుంకేసుల సెక్టార్ లోని అంగన్వాడి కార్యకర్తలతో సెక్టార్ మీటింగ్ మార్కాపూర్ రూరల్ ఆఫీస్లో నిర్వహించారు. ఈ ముఖ్యఅతిథిగా దోర్నాల ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ఎం.పద్మావతి పాల్గొన్నారు. సిడిపిఓ మాట్లాడుతూ పోషణ మాసోత్సవాన్ని నిర్వహించవలసిన అవసరం, ఆకుకూరలు చిరుధాన్యాలు తినడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అందరికీ వివరించారు. అనంతరం ఎఫ్ ఎల్ ఎం డిస్టిక్ కో ఆర్డినేటర్ ఎం సుబ్బారావు మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసే విధానాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో దోర్నాల ప్రాజెక్ట్ ఐసిడిఎస్ సిడిపిఓ ఎం పద్మావతి, డిస్టిక్ కోఆర్డినేటర్ ఎం.సుబ్బారావు, సుంకేసుల సెక్టార్ సూపర్వైజర్ లక్ష్మీదేవి, పెద్దారవీడు సెక్టార్ సూపర్వైజర్ అంజమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీ టూరిజం శాఖ డైరెక్టర్ను కలిసిన జర్నలిస్ట్ మల్లి



(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, సెప్టెంబర్ 28)

రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవులలో ఏపీ టూరిజం శాఖ డైరెక్టర్ గా నియమితులైన జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి , యర్రగొండపాలెం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ పాకనాటి గౌతమ్ రాజ్ ను విజయవాడలో కలిసిన జర్నలిస్ట్ చింతగుంట్ల మల్లికార్జున మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సీఎం చంద్రబాబు మాటలు ప్రక్షాళన చేయాలి

### యర్రగొండపాలెంలో వైసీపీ నాయకులు పూజలు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్ఛార్జి, సెప్టెంబర్ 28)

తిరుమల లడ్డు ప్రసాదం పవిత్రతపై ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తుందంటూ సీఎం చంద్రబాబు మాటలు ప్రక్షాలన చేయాలని కోరుతూ యర్రగొండపాలెంలోని రచ్చ బండ తోటలో గల వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన యర్రగొండపాలెం నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు,పార్టీ అధ్యక్షులు వై.యస్. జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాలతో మండలంలోని వైసీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

## నాకు న్యాయం చేయండి

ఓ స్త్రీ ఆవేదన

మా కుటుంబాన్ని వేరు చేసేందుకు

పెద్ద మనుషులు ముందుకు వస్తున్నారు

వారి పై చర్యలు తీసుకోవాలి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, సెప్టెంబర్ 28)

తన భర్త శ్రీహరికోట శ్రీనివాసులు బెట్టింగులకు పేకాటలకు అలవాటు పడి తన పెళ్లి కానుకలు కింద ఇచ్చిన 30 లక్షల రూపాయలు నాశనం చేశారని ఆయన భార్య శ్రీహరికోట పుష్ప ఆరోపించారు. ముత్తుకూరు మండలం కి చెందినఆమె శనివారం నెల్లూరు ప్రెస్ క్లబ్ లోని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన భర్త వేరే వారితో అక్రమ సంబంధం పెట్టుకుని తనను, ఇద్దరు ఆడపిల్లలను వదిలిపెట్టి పారిపోయాడన్నారు. విషయంలో గ్రామస్తులు పంచాయితీ పెట్టడం జరిగిందన్నారు. ఆ పంచాయతీ కి సంబంధించి గ్రామ పెద్దలు నాలుగు లక్షలు ఇస్తే నీ భర్త నీ దగ్గరికి వస్తాడని చెప్పడం జరిగిందన్నారు. తాను అంత ఇవ్వలేదని వారికి మొర పెట్టుకోవడం జరిగిందన్నారు. కానీ నా భర్తని నా దగ్గరికి రానీకుండా కొంతమంది గ్రామంలో అడ్డుకుంటున్నారని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని వీధిన పడిన తమ కుటుంబానికి రక్షణ కల్పిం చి, తన భర్తను రానీకుండా ఉన్నటువంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## రాజకీయ లబ్ధి కోసమే జగన్మోహన్‌రెడ్డి పై బురద పల్లె ప్రయత్నం

మాజీ మంత్రి, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఫైర్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, సెప్టెంబర్ 28)

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై రాజకీయ లబ్ధి కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కల్తీ నెయ్యితో తిరుమలలో తయారు చేశారంటూ చంద్రబాబు నోటికొచ్చినట్లు ఆరోపణలు చేశారని ఆయన అన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల అపవిత్రం చేశారని ఆయన ఆరోపణలు తమ నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం కోవూరు నుండి లక్ష్మీ నగర వద్ద శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. చంద్రబాబు అసత్య ప్రచారంతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. లడ్డులు కల్తీ నెయ్యి లేదంటూ సాక్షాత్తు టీటీడీ అధికారులే చెప్పారు అన్నారు. దీనిపై ప్రజలను తప్పు దోవ పట్టించేందుకు ఈ రకంగా చంద్రబాబు, ఆయన మంత్రివర్గం నాటకాలు ఆడుతున్నారన్నారు. నాటకాల అడ్డం కాదు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో మంచి సత్సంబంధాలు ఉన్నాయని సి.బి.ఐ, సిట్టింగ్ జడ్జి ద్వారా ఎంక్వయిరీ చేయించి నిజం మాట్లాడాలని అంతేకానీ లేనిపోని అబద్ధపు ప్రచారం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కోవూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేట నూతన ఆర్డీవోగా వి కిరణ్మయి



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇన్‌ఛార్జి, సెప్టెంబర్ 28)

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారిగా నూతనంగా వి కిరణ్మయి శనివారం పదవి బాధ్యతలు చేపట్టారు. సూళ్లూరుపేట లో ఉన్నటువంటి రంగాల చంద్రముని బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో వి కిరణ్మయి పదవీ బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఆమెను సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ ఆమె భర్త పార్థ సారధి ఇరువురు ఆమెతో మాట్లాడి అభినందించారు. ఆమె గుంటూరులో పనిచేసి విజయవాడ లో పని చేసి బదిలీ పై సూళ్లూరుపేట కు రావడం జరిగినది ఆమె ను ఆర్డీవో కార్యాలయం సిబ్బంది స్వాగతం పలికి ఆహ్వానించారు. కార్యక్రమం లో ఆర్డీవో కార్యాలయం డి ఏ ఒ కే రవికుమార్ ఆమె కు స్వాగతం పలికి ఆహ్వానించారు. అనంతరం బదిలీ అయి వెళ్ళిపోతున్న ఆర్డీవో ఆర్ చంద్రముని కి ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు కార్యక్రమానికి సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే నెలవాలా విజయ శ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఆయనను శాలువాలతో సన్మానం చేశారు అభినందించారు. బదిలీపై వెళ్లిన ఆర్డీవో చంద్రముని వారి సతీమణి కి ఘన వీడ్కోలు పలికారు ఆర్డీవో కార్యాలయం సిబ్బంది ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు అభినందించారు.

# రాజ్యాంగాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి

జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మ రెడ్డి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

దేశవ్యాప్తంగా రాజ్యాంగాన్ని విస్తృతంగా ప్రచారం చేయాల్సినటువంటి అవసరం ఉపాధ్యాయుల పైన ఉంది అని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన టువంటి ప్రతి అంశాన్ని సామాన్య ప్రజలకి తెలియాలని అలా తెలియకపోతే ప్రజలకి చాలా ఇబ్బంది కలుగుతుందని అన్నారు. అదేవిధంగా ప్రాథమిక విద్య నుంచి కూడా విద్యార్థులు విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కలిగిస్తూ ఉండాలని అలా చేయగలిగితే రాబోయే రోజుల్లో ఒక మంచి పౌర సమాజాన్ని నిర్మాణం చేయగలుగుతామని అన్నారు.జమిలి ఎన్నికల వల్ల కూడా ప్రమాదం ఉందని డాక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. దీని మీద ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్రజలు ఐక్యంగా ఉంటారని ప్రజలు తిరగబడితే ఏ ప్రభుత్వం కూడా నిలబడలేదని ఆయన అన్నారు.ప్రజలకు మేలు జరగాలని జనవిజ్ఞాన వేదిక భావిస్తుందని ఈ నేపథ్యంలోనే మూఢనమ్మకాల నిర్మూలన అదేవిధంగా విలువైన విద్య విలువలు వాటి మీద ఎక్కువ ప్రచారం చేస్తుందని ఆరోగ్యం పట్ల కూడా గ్రామస్థాయిలో కూడా ప్రచార కార్యక్రమాలు చేపడుతుందని అదేవిధంగా ప్రజలకి మేలు జరిగే కార్యక్రమాల్లో జలవిజ్ఞాన వేదిక ముందుంటుందని ఆయన అన్నారు. కనిగిరిలోని యూటీఎఫ్ ఆఫీస్‌లో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మారెడ్డి ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సభకి జనవిజ్ఞాన వేదిక నాయకులు ఖాజా హుస్సేన్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు షేక్ గయాజ్ భాష, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మాలకొండ రెడ్డి , రమణారెడ్డి బషీర,ఆది నారాయణ, ధనుంజయ, మీనా, రాయుడు, కొండమ్మ, ఫణి తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచులను ఎమ్మెల్యేలు శత్రువులుగా చూడొద్దు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)




ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు గ్రామ పంచాయితీ సర్పంచ్‌లను శత్రువులుగా చూడొద్దని, గ్రామాలఅభివృద్ధికి పరస్పరం కలిసి పనిచేయవలసి అవసరం ఎంతైనా ఉన్నదని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి. వీరభద్రాచారి ఎమ్మెల్యేలను అభ్యర్థించారు. శనివారం స్థానిక పంచాయితీరాజ్ అతిథి గృహంలో జరిగిన సర్పంచుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ చెర నుంచి బయట పడడంకోసం, కూటమి ప్రభుత్వ విజయం కోసంతోపాటు ఇంత ఆధిక్యత సాధించడానికి గ్రామస్థాయిలో సర్పంచుల మద్దతు ఉన్నదని ప్రభుత్వ పెద్దలు గ్రహించాలని వీర భద్రాచారి గుర్తు చేశారు.ప్రస్తుతం మండల స్థాయిలో గల ఇంజనీరింగ్ అధికారులు గ్రామాలలో ఎలాంటి బిల్లులు తమకు తెలియకుండా చేయొద్దని, చెల్లించోద్దని , ఏ బిల్లులు ఐనా ఎమ్మెల్యేలు ఆపమన్నారని, ఎంఎల్ఏ ను కలసి మాట్లాడుకోవాలని, స్వయంగా వారే చెబుతున్న తీరు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందన్నారు.కార్యదర్శుల బదిలీల్లో జాయినింగ్,రిలీవ్ ప్రక్రియలో గ్రామ పంచాయితీ ప్రమేయం లేకుండా కనీసం సమాచారం లేకుండా డీ.పీ.ఓ ,ఎంపిడిఓ లే చేయడం నిబంధనలకు విరుద్ధమనీ, కార్యదర్శులు రిలీవ్ సమయంలో ఆర్థిక,పరిపాలనా లావాదేవీలకు చెందిన అన్ని రికార్డులు అప్పగించాలని దానికి నో-అబ్జెక్షన్ పత్రం పొందిన తర్వాతనే వారి రిలీవ్ జరగాలని డిమాండ్ చేశారు.ఎందుకంటే లక్షలాది రూపాయలకు లెక్కలు చెప్పకుండా వారిని ఎలా బదిలీ చేస్తారని సూటిగా ప్రశ్నించారు.ఆర్థిక సంఘం నిధులు విడుదలై రెండు రెండు నెలలు కావస్తున్నా వినియోగానికి అనుమతులు ఇవ్వలేదన్నారు. సర్పంచుల సమస్యలపై పరిష్కారం కోరుతూ కలెక్టర్‌ను కలసి మెమొరాండం సమ ర్పించారు.కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వీర భద్రాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం నాయకులు మన్నం శ్రీనివాస్, బి రామూయాదస్, జి ప్రదీప్, జనార్ధన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టిస్తున్న ఎస్సై

అక్రమ కార్యక్రమాలు, అక్రమ రవాణా చేసే మాఫియా పాలిట సింహ స్వప్నం

ఎస్ఐ మల్లికార్జున



(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం , సెప్టెంబర్ 28)

వరదయ్య పాలెం మండలంలో ద్విచక్ర వాహనాలపైనే చక్కర్లు వేస్తూ(మఫ్టీలో) మండలాన్ని చుట్టేస్తూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం రాజీపడకుండా విధి నిర్వహణలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శాంతి భద్రతలే ప్రధాన అంశంగా బెల్ట్ షాపులపై అనుమతులు లేకుండా అక్రమ రవాణా చేసే వారిపై, నిఘా పెట్టి పకడ్బందిగా చట్టం ఉచ్చును బిగిస్తున్న ఎస్సై మల్లికార్జున. గతంలో లాగా కాకుండా భిన్నంగా ఫిర్యాదులు అందిన వెంటనే విచారణ చేపట్టి చట్ట పరిధిలో బాధితులకు ఏ మేరకు రక్షణ కల్పించాలో కల్పిస్తూ వెంటనే స్పందిస్తున్న ఎస్సై నాగార్జున. సత్యవేడు సీఐ మురళి, డీఎస్పీ మరియు జిల్లా ఎస్పీల పూర్తి ప్రోత్సాహంతో ఈ యువ పోలీస్ అధికారి విధి నిర్వహణను విమర్శకులు సైతం ప్రశంసిస్తున్న వైనం. గతంలో మండలం మాఫియా అడ్డాగా ఉండే పరిస్థితులు బహిరంగ రహస్యం. రేషన్ మాఫియా,ఇసుక మాఫియా,గంజాయి మాఫియా,ఎర్ర మట్టి మాఫియా రాజ్యమేలిన ఈ మండలంలో ఈ అధికారిని చూసి (ఎస్సై మల్లికార్జున ను) వణుకుతున్నట్లు సమాచారం. విధి నిర్వహణలో చట్టంపై ప్రజలకు నమ్మకం కలిగే విధంగా ఒత్తిళ్లకు లొంగకుండా ఎక్కడ రాజీ పడకుండా విధులు నిర్వహిస్తున్న ఇలాంటి అధికారికి ప్రోత్సహిస్తున్న ఉన్నతాధికారులకు సలాం అని ప్రజలు అంటున్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా గుర్రం జాషువా జయంతి వేడుకలు

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 28)

మండల కేంద్రమైన ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల, నందు శనివారం సాయంత్రం గుఱ్ఱం జాషువా జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం ప్రిన్సిపాల్ గారపాటి గోపీ చంద్ ప్రకాష్ అధ్యక్షతన జరుగగా, తెలుగు అధ్యాపకులు మాధవరెడ్డి గుఱ్ఱం జాషువా గారి జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. అనంతరం స్వర్ణ ఆంధ్రప్రదేశ్ఏ2047 వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమం లో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## జిల్లా హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక



(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, సెప్టెంబర్ 28)

ప్రభుత్వ ఉన్నత పాఠశాల సింగరాయకొండ లో జరిగినటువంటి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ సెలక్షన్స్ లో దాదాపుగా 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమానికి అధ్యక్షులుగా మండల విద్యాశాఖ అధికారి మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కత్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు మరియు ప్రకాశం జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ, కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ కె.శంకర్రావు, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు బండి కోటేశ్వరరావు వారి సతీమణి రాజరాజేశ్వరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎ పి ఇ అసోసియేషన్ సెక్రటరీ నత్తల కృష్ణ మరియు వ్యాయామ ఉపాధ్యాయులు కిరణ్ కుమార్, వెంకట్రావు, నర్రా కోటేశ్వరరావు, రమణయ్య ,ఉపాద్యాయులు అర్రిబోయిన రాంబాబు,అంబటి బ్రహ్మయ్య,పూర్ణచంద్రరావు పాల్గొన్నారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కే మాల్యాద్రి మరియు సయ్యద్ జంషీర్ అబ్దాల్ తెలియజేశారు.

## నూకసాని బాలాజీని కలిసిన కొనకనమిట్ల మండల టీడీపీ నేతలు





(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, సెప్టెంబర్ 28)



ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీని కొనకనమిట్ల మండల టీడీపీ నాయకులు పలువురు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాలాజీని సత్కరించిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు, మాజీ అధ్యక్షులు వరికూటి రామిరెడ్డి, వెంకట నారాయణ చౌదరి, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్, కనకం నరసింహారావు, మువ్వా కాటంరాజు, నాసరయ్య, గురవయ్య, రోశయ్య, భయ్యా నాగేశ్వరరావు, మూరబోయిన ప్రసాద్, ప్రభాకర్, సల్మాన్, అంజిరెడ్డి, రాజు, రబ్బానీ, ప్రసాద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్ కు విరాళం అందించిన టీడీపీ నేతలు



(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 28)

కంభం పట్టణానికి చెందిన ఎన్నారై టీడీపీ సభ్యులు సయ్యద్ రఫీ, దీనావలి, మహబూబ్ బాషా, ఉస్మాన్ బేగ్ రూ.20,000ల చెక్కును గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు ఎంతో ఉపయోగకరమైన అన్నా క్యాంటిన్ ఎంతోమందికి ఆకలిని తీర్చుతుందని ఇలాంటి మంచి కార్యక్రమానికి సహకరిస్తున్నందుకు చాలా సంతోషం అని అందరిని అభినందించారు.

# జీవనశైలి, ఆహారపు అలవాట్ల మార్పుతోనే వ్యాధుల నుండి రక్షణ సాధ్యం

## జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్











(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

జీవనశైలి, ఆహారపు అలవాట్ల మార్పుతోనే వ్యాధుల నుండి రక్షణ సాధ్యమవుతుందని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ అన్నారు. శనివారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఒంగోలు కిమ్స్ హాస్పిటల్స్ వారు ప్రకాశం జిల్లా పోలీస్ వారి ఆద్వర్యంలో 3 కిలోమీటర్ల నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ హాజరై జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ మన జీవన శైలి, ఆహారపు అలవాట్ల మార్పు ద్వారా సంబంధిత వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చని, మన గుండె సంరక్షణకు నిత్య జీవితంలో నడక భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సంవత్సరం "వరల్డ్ హార్ట్ డే సందర్భంగా "యూస్ ఆర్ట్ ఫర్ యాక్షన్" అనే థీమ్ తో కార్యక్రమాలను 11 నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్స్ వైద్య గుండె నిపుణులు డా.హరీష్ , డా . ఆనంద్, డా. కపిల్ కార్తికేయ రెడ్డి , సి..టీ.వీ.స్. డా.లక్ష్మణ్ రెడ్డి పాల్గొని తమ విలువైన సూచనలు అందించారు. కిమ్స్ హాస్పిటల్స్, ఒంగోలు చీఫ్ కార్డియోలాజిస్ట్ డా.హరీష్ మాట్లాడుతూ మన శరీరంలో గుండె అతి ముఖ్యమైన భాగమని, ఇది సక్రమంగా పని చేస్తేనే శరీరంలోని మిగిలిన భాగాలు బాగా పని చేస్తాయన్నారు నడక గుండె ఆరోగ్యానికి అతి ముఖ్యమైన వ్యాయామం అని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఎక్సిక్యూటివ్ డైరెక్టర్ టి. గిరి నాయుడు ,సి.ఓ.ఓ.కే. అంకిరెడ్డి ,మెడికల్ డైరెక్టర్ డా.శ్రీ హరి రెడ్డి , కిమ్స్ వైద్య బృందం,సిబ్బంది,పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి పరీక్షలకు లుంబిని విద్యార్థులు ఎంపిక





(షణ్ముఖ వెలుగు, చేజర్ల, సెప్టెంబర్ 28)

స్వర్ణాంధ్ర 2047 కు సంబంధించి స్వర్ణాంధ్రను సాధించుటకు రాబోవు ఐదు సంవత్సరాలలో విద్యారంగంలో తీసుకురావలసిన సంస్కరణలు అనే అంశం మీద చేజర్ల మండలం నందు నిర్వహించిన వ్యాసరచన, డిబేట్ పోటీలలో జిల్లా స్థాయికి ఎంపికైన లుంబిని విద్యార్థులు వ్యాసరచనలో కె.హిమ వర్ణ డెబిట్‌లో యు.అనూష లుంబిని విధ్యాలయం నుండి ఏంపిక అయ్యారు.పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.

## ఎస్ఐ కిషోర్ బాబును కలిసిన వైసిపి నాయకులు




(షణ్ముఖ వెలుగు, పామూరు, సెప్టెంబర్ 28)

పామూరు పట్టణ నూతన ఎస్ఐ కిషోర్ బాబు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం మండలం వైఎస్ఆర్సిపి నాయకులు వారికి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. అనంతరం వైసిపి నాయకులు మాట్లాడుతూ పామూరు మండలంలోని శాంతిభద్రతల విషయంలో ప్రత్యేక చూపాలని కోరారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చప్పిడి సుబ్బయ్య సీనియర్ నాయకులు పట్టణ అధ్యక్షులు చాంద్ భాష, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, యాదాల సాయి, కల్లూరు రామిరెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీకి శుభాకాంక్షలు తెలిపిన పోతినేని శ్రీనివాసరావు (పి.యస్.ఆర్)






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీని శనివారం భాగ్యనగర్‌లోని ఒంగోలు పార్లమెంట్ కార్యాలయం నందు మద్దిపాడు మండల మాజీ తెలుగు యువత అధ్యక్షులు పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్) మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈయన వెంట టిడిపి నాయకులు అడకస్వాములు, మందపల్లి శ్రీనివాసరావు, మోనపాటి రామకృష్ణ, గడ్డం రవి, తదితరులు పాల్గొన్నారు.

## బాలాజీని సత్కరించిన రాచర్ల మండల పార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్

(షణ్ముఖ వెలుగు, రాచర్ల, సెప్టెంబర్ 28)

ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ ని శనివారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో రాచర్ల మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రసిద్ధిగాంచిన నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయాన్ని పర్యాటక క్షేత్రంగా మార్చడానికి టూరిజం శాఖ తరపున ప్రయత్నం చేయాలని మండల పార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్, జిల్లా తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి గోపిరెడ్డి జీవనేశ్వరరెడ్డిలు కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఈ అంశాన్ని తప్పక పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



# క్రీడా రంగాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం

## శాప్ చైర్మన్ రవి నాయుడు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు.ఒంగోలు విచ్చేసిన ఆయనను పలువురు తెలుగు యువత నాయకులు, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా తెలుగు యువత అధ్యక్షులు ముత్తన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు, అనంతరం శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరుతో కోట్ల రూపాయలను అవినీతి చేసిందని ఆరోపించారు. గడిచిన ఐదు సంవత్సరాలు క్రీడాకారుడు క్రీడలకు దూరమయ్యారని అన్నారు, ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచి క్రీడలను బలోపేతం చేసి క్రీడాకారులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తామని తెలిపారు,గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపిస్తామని అన్నారు.నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు, వైద్య కళాశాల సీట్లు పొందిన వారిపై కూడా విచారణకు అదేశిస్తామని తెలిపారు.త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటన చేసి క్రీడా రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు, తనకు శాప్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ బాబుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్, రాజేంద్ర, మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఉలవపాడులో వైసీపీ నాయకుల పూజలు

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 28)



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ పిలుపుమేరకు శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేసిన నారా చంద్రబాబు నాయుడు పాపానికి ప్రక్షాళన కోరుతూ ఈ పాపం రాష్ట్ర ప్రజల మీద పడకుండా మండల కేంద్రంలోని ఉలవపాడు శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం నందు మండల పార్టీ అధ్యక్షులు నన్నం పోతురాజు , పట్టణ అధ్యక్షులు వేమిరెడ్డి కృష్ణారెడ్డి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రెటరీ మాధవ, ఐటి వింగ్ సెక్రెటరీ కోటయ్య, ఎస్సీ సెల్ సెక్రెటరీ చంద్రశేఖర్, ప్రచార కమిటీ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు మండల కొఆప్షన్ సభ్యులు ఖాదర్ భాషా కరేడు గ్రామ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులురెడ్డి, ప్రభాకర రెడ్డి , సీహెచ్‌సీ సభ్యులు బ్రహ్మయ్య, వెంకట్రామిరెడ్డి, పంచాయతీ సభ్యులు మాధవరావు , వెంకటేశ్వర్లు, రమేష్ , రాము రెడ్డి , నిశాంత్ రెడ్డి ,రఘు రెడ్డి ,బాలకోటయ్య , అనురాధ , శ్రీనివాసరాజు, నరసరాజు, ప్రకాశం (ఆర్టీసీ) సుబ్బారావు, అహ్మద్, చంద్రమౌళి పాల్గొని జయప్రదం చేశారు.

## బద్దిపూడి, భీమవరం గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమం

కందుకూరు సిఐ వెంకటేశ్వర్లు, ఉలవపాడు ఎస్ఐ అంకమ్మ



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 28)

మండల పరిధిలోని బద్దిపూడి, భీమవరం గ్రామాలను శనివారం కందుకూరు సి ఐ వెంకటేశ్వర్లు, ఉలవపాడు ఎస్ఐ కె.అంకమ్మ శనివారం సందర్శించి పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలతో మమేకమై వారికి గంజాయి మద్యం జూదం మహిళల భద్రత సైబర్ నేరాలు రోడ్డు ప్రమాదాలు సీసీ కెమెరాలు మొదలగు అంశాల మీద తగిన సూచన సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి ఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.అంకమ్మ తోటి పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

ఒకరు దుర్మరణం



(షణ్ముఖ వెలుగు, పామూరు, సెప్టెంబర్ 28)

మండలంలోని రావి గుంటపల్లి గ్రామ సమీపంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రావి గుంటపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన తాతిరెడ్డి వీరనారాయణరెడ్డి అనే వ్యక్తి అక్కడికి అక్కడే మృతి చెందారు.